
ప్రత్యక్ష అమ్మకం మాయం

■ మూడు మార్కెట్లో ముంచుతున్నారు



జరగాల్సింది

మార్కెట్ యార్డుకు రైతు తెచ్చిన సరకుకు లాట్ సంఖ్య కేటాయించి ఈ-నామ్ విధానంతో టెండర్ పూర్తి చేయించాలి.. అధిక ధర నమోదు చేసిన వ్యాపారికి సరకు కేటాయించాలి.. తూకాలు మొదలు తక్ పట్టి, నగదు చెల్లింపు వరకు యార్డులో అడుగడుగునా అధికారుల పర్యవేక్షణలో జరగాలి.. ఇది ఎక్కడా అమలు కావడం లేదు.. ఫలితంగా రైతులు రూ.కోట్లలో నష్టపోతున్నారు.!!

జరుగుతోంది

పంట దిగుబడులు యార్డుల్లో విక్రయించడం అన్నదాతలకు సవాల్‌గా మారింది.. రకరకాల ఆర్థిక కోతలతో రైతు ఉక్కిరిబిక్కిరవుతున్నారు.. విక్రయించిన సరకు మొత్తం విలువపై రెండు శాతం కమీషన్ యార్డు ఏజెంటుకు చెల్లించాల్సి ఉంటుంది. విక్రయించిన వెంటనే రైతుకు నగదు చెల్లించాలంటే.. కమీషన్‌తో పాటు నూటికి రూ.2 అదనంగా కోత పెడుతున్నారు.!!

★ ఇలాంటి నష్టాల నుంచి రైతులను గట్టెక్కించేందుకు ప్రత్యక్ష విక్రయాల విధానం ఉన్నా అధికారులు దృష్టిసారించడం లేదు. గత ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా ఏనాడూ పట్టించుకోలేదు.. ఖరీఫ్ దిగుబడులు ఇప్పుడిప్పుడే మార్కెట్‌కు వస్తున్నాయి.. 'కూటమి' ప్రభుత్వం దృష్టి సారించి ప్రత్యక్ష విక్రయ విధానాన్ని వేగవంతం చేయాలని అన్నదాతలు విన్నవిస్తున్నారు.

– ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే:

జిల్లాలో ఆదోని, ఎమ్మిగనూరు, కర్నూలు మార్కెట్‌యార్డుల్లో పెద్దఎత్తున్న క్రయవిక్రయాలు సాగుతాయి. పత్తి, వేరుశనగ, ఆముదాలు, శనగలు, కందులు, ఉల్లి, పూలవిత్తనాలు, వాము, కుసుమలు తదితర పంట దిగుబడుల విక్రయాలు సాగుతాయి. మూడు యార్డుల్లో కలిపి ఏటా సరాసరి 1.20లక్షల మంది రైతులు వస్తుంటారని అంచనా. మూడు యార్డుల్లో 2023-24 ఏడాదికి రూ.2800 కోట్లకు సంబంధించి రైతులకు అప్పటికప్పుడు చెల్లించిన నగదుకు గాను నూటికి రూ.2 చొప్పున వడ్డీ లెక్కిస్తే రూ.56 కోట్ల మేర రైతులు ఆర్థికంగా నష్టపోవాల్సి వచ్చింది. కమీషన్ వసూలు, వడ్డీ కోతలతో రైతులు రూ.112 కోట్ల మేర నష్టపోయినట్లు లెక్కలు చెబుతున్నాయి.

తనిఖీలతోనే సరి

యార్డుల్లో రైతుల నుంచి కేవలం కమీషన్ తప్ప ఇతరత్రా పేరుతో ఆర్థిక కోతలు విధించే విధానాలు లేవు. అనధికారికంగా జరిగిపోతున్నా.. వీటిని నిలువరించలేకపోతున్నారు. ఇది అనాదిగా కొనసాగుతూనే ఉంది. దీన్ని నిలువరించే సాహసం ఎవరూ చేయడం లేదు. పైఅధికారులు తనిఖీలకు వచ్చినప్పుడు మాత్రం నిలిపివేస్తామని చెబుతారు. తర్వాత యథామామూలే. నిలువరించే ప్రయత్నం చేయడం లేదు.

నడ్డివిరుస్తున్న వడ్డీ

● యార్డుల్లో కమీషన్ ఏజెంటు, వ్యాపారి మధ్య నగదు చెల్లింపులపై కుదుర్చుకున్న ఒప్పందాల మేరకు వ్యాపారం సాగిస్తున్నారు. రైతు తెచ్చిన సరకును అమ్మించే బాధ్యత కమీషన్ ఏజెంటు తీసుకుంటారు. వ్యాపారి, రైతుకు ఏజెంటు మధ్యవర్తిగా వ్యవహరిస్తారు.

● సరకు అమ్మిన వెంటనే నగదు చెల్లించాలంటే.. నూటికి రూ.2 చొప్పున నగదు కోత విధించి, రైతుకు కమీషన్ ఏజెంటు అందజేస్తారు. ఈ లెక్కన రూ.10 వేలకు రూ.200, రూ.లక్షకు రూ.2 వేలు వడ్డీ వసూలు చేస్తారన్నమాట. ఇక్కడా కమీషన్ ఏజెంటు, వ్యాపారి మధ్య ఉన్న చెల్లింపు గడువు కారణంగా రైతుకు అదనపు ఆర్థిక కోతలు పడుతున్నాయి.

నమ్మకానికి నామినేటెడ్ పదవి

■ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ అధ్యక్షుడిగా సుబ్బారెడ్డి



ఈనాడు, కర్నూలు : రాష్ట్రంలో పలు కార్పొరేషన్ల అధ్యక్షులు, సభ్యులను నియమిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం నిర్ణయం తీసుకున్నారు. డోన్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషిచేసిన మన్నె సుబ్బారెడ్డికి రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ పదవి కట్టబెట్టారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మరో నలుగురికి వివిధ కార్పొరేషన్లలో డైరెక్టర్లు/సభ్యుల పదవి కట్టబెట్టారు. 2017లో తెదేపాలో చేరిన సుబ్బారెడ్డి 2021వ సంవత్సరం నుంచి డోన్ ఇన్‌ఛార్జిగా వ్యవహరించారు. గత ఎన్నికల్లో కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డికి టికెట్ ఇవ్వడంతో ఆయన మనస్ఫూర్తిగా సహకరించారు. అధిష్ఠానం హామీతో 'కోట్ల' విజయానికి సహకరించారు. ఈ నేపథ్యంలో ఆయనకు కీలక పదవి కట్టబెట్టారు.

పర్యాటకాభివృద్ధి కార్పొరేషన్ సభ్యురాలిగా పద్మలతారెడ్డి



నగరపాలక సంస్థ 17వ వార్డు కార్పొరేటర్ కైపా పద్మలతారెడ్డి ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి కార్పొరేషన్ సభ్యురాలిగా నియమించారు. ఆమె జనవరిలో వైకాపాను వీడి తెదేపాలో చేరారు. 'నాగిరెడ్డి కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఛైర్‌పర్సన్'గా ఉన్నారు. ఆమె తండ్రి కె.వి.సుబ్బారెడ్డి తెదేపాలో చేరి పార్టీ విజయానికి కృషి చేశారు. మంత్రి టీజీ భరత్ ప్రోత్సాహంతో పదవి వరించింది.

పౌరసరఫరాల కార్పొరేషన్ సభ్యుడిగా కొంకతి



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ సభ్యుడిగా కర్నూలుకు చెందిన కొంకతి లక్ష్మీనారాయణను నియమించారు. 2021 నుంచి రాయలసీమ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా ఉన్నారు. ఆ తర్వాత తెదేపాలో చురుగ్గా పని చేశారు. మంత్రి టీజీ భరత్ వర్గీయుడిగా గుర్తింపు పొందారు.

మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా తులసిరెడ్డి



నంద్యాల సమీపంలో కొత్తపల్లికి చెందిన తాతిరెడ్డి తులసిరెడ్డిని మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా నియమించారు. మంత్రి ఫరూక్ అనుచరుడిగా గుర్తింపు పొందారు. ఆయనతో పాటు ఆయన సమీపబంధువు కొత్తపల్లి సర్పంచిగా పనిచేశారు. తెదేపా లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడిగా సేవలందించారు.

రామాంజనేయులుకు కీలక పదవి



కల్లూరుకు చెందిన రామాంజనేయులును ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ సభ్యుడిగా నియమించారు. ప్రస్తుతం కల్లూరు మండల పార్టీ అధ్యక్షుడిగా, క్లస్టర్ ఇన్‌ఛార్జిగా ఉన్నారు. వైకాపా హయాంలో ఆయనపై రెండు కేసులు పెట్టారు. ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి సహకారంతో పదవి దక్కించుకున్నారు.

ప్రయాణమే ఓ పరీక్ష

■ టెట్ అభ్యర్థులకు ఇతర జిల్లాల్లో కేంద్రాలు
■ ఒకే రోజు టెట్, బీఈడీ సప్లిమెంటరీ పరీక్షలు

ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు చంద్రబాబు నాయుడు సీఎం పగ్గాలు అందుకోగానే ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి పచ్చజెండా ఊపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో సుమారు 2,600 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. 'కొలువు'దీరేందుకు అభ్యర్థులు రేయింబవళ్లు సిద్ధమవుతున్నారు.

ఇందులో భాగంగా ప్రభుత్వం నిర్వహించే ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రాసేందుకు సన్నద్ధమవుతున్నారు. దీనికి సుమారు 60 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి వచ్చే నెల 3వ తేదీ నుంచి 20వ తేదీ వరకు పరీక్ష నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. పరీక్ష సమయం సమీపిస్తుండటంతో అధికారులు హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో ఉంచారు. వీటిని తీసుకున్న అభ్యర్థులు పరీక్షా కేంద్రాల వివరాలు చూసి కంగుతింటున్నారు. పరీక్షా కేంద్రాలను ఇష్టానుసారంగా వేయడంతో అంతదూరం ఎలా వెళ్లాలో తెలియక అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.

కర్నూలు విద్య, న్యూస్‌టుడే :



టెట్‌కు సిద్ధమవుతున్న అభ్యర్థులు

దూర ప్రాంతాలకు విసిరేశారు

ఉమ్మడి జిల్లాకు చెందిన అభ్యర్థులు టెట్ పరీక్ష కేంద్రాలుగా సొంత జిల్లాలోని ప్రాంతాలను ఎంపిక చేసుకున్నారు. కానీ చాలామందికి హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, అనంతపురం, చిత్తూరు జిల్లాలోని కేంద్రాలు కేటాయించారు. సుమారు 35 వేల మంది అభ్యర్థులకు దూర ప్రాంతాలు వేసినట్లు సమాచారం. కొందరు భార్యాభర్తలిద్దరూ టెట్ రాస్తున్నారు. భర్తకు విజయవాడ పరీక్ష కేంద్రంగా.. భార్యకు అనంతపురం జిల్లా తాడిపత్రి పరీక్ష కేంద్రం ఇవ్వడం గమనార్హం.

గుంటూరుకు వేశారు : నారాయణ, కల్లూరు

మేము కల్లూరులో నివాసం ఉంటాం. టెట్ ప్రకటన వచ్చిన నాలుగు రోజుల్లోనే దరఖాస్తు చేశా. మొదటి ప్రాధాన్యం కింద కర్నూలు నగరం పెట్టుకుంటే.. గుంటూరుకు వేశారు. గుంటూరుకు వెళ్లి రావాలంటే సుమారు రూ.5 వేలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి. దీనికితోడు అంతదూరం ప్రయాణించడమంటే కష్టమే. కర్నూలులోనే పరీక్ష రాసేలా అవకాశమివ్వాలి.



దేనికి హాజరు కావాలో – చంద్రబాబు, కర్నూలు

విజయవాడలో అక్టోబరు 4వ తేదీన టెట్ ఉంది. అదే రోజు బీఈడీ సప్లిమెంటరీ పరీక్ష రాయాల్సి ఉంది. ఒకటి కర్నూలులో.. మరొకటి విజయవాడలో ఉంది. ఏ పరీక్షకు హాజరుకావాలో అర్థం కావడం లేదు.

ఒకే రోజు రెండు

రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో అక్టోబరు 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. 750 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు. వీరందరూ టెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ఒకేరోజు.. అక్టోబరు 4వ తేదీన బీఈడీ సప్లిమెంటరీ, టెట్ ఉంది. దీంతో చాలామంది ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని ఆర్‌యూ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లగా టెట్ ఉన్నరోజు బీఈడీ సప్లిమెంటరీ పరీక్ష తేదీలు మార్చుతామని పేర్కొన్నారు.



ఆర్థిక భారమే – సుభాష్, కర్నూలు

మేము కర్నూలు నగరంలో నివాసం ఉంటున్నాం. పరీక్ష కేంద్రంగా హైదరాబాద్ వేశారు. కర్నూలు నుంచి అక్కడి వెళ్లి రావాలంటే ఒకరికి సుమారు రూ.2 వేల వరకు ఖర్చవుతుంది.

బీఈడీ టెట్ అభ్యర్థులను గుర్తించండి

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో అక్టోబరు 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు బీఈడీ పరీక్షలు జరుగుతాయని ఇన్‌ఛార్జి వీసీ ఎన్‌టీకే నాయక్ మంగళవారం తెలిపారు. అక్టోబర్ 3వ తేదీ నుంచి టెట్ సైతం జరగనుందని.. రెగ్యులర్ విద్యార్థులతోపాటు సప్లిమెంటరీ పరీక్ష రాసే అభ్యర్థులు ఉన్నారని చెప్పారు. ఇలాంటివారిని గుర్తించాలని బీఈడీ కళాశాలల ప్రిన్సిపాళ్లకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. అభ్యర్థులు నేరుగా రాయలసీమ విశ్వవిద్యాలయంలోని పరీక్ష విభాగంలో సంప్రదించాలని కోరారు.

గొంతు తడపాలంటే.. పుట్టి ఎక్కాల్సిందే



కర్నూలు మండల పరిధిలోని పలు గ్రామాలకు తుంగభద్ర నదిలోని బోరు బావుల ద్వారా తాగు నీరు అందిస్తుంటారు. ఇటీవల మోటార్లు చెడిపోవడంతో తాగు నీటి సరఫరా ఆగిపోయింది. సిబ్బంది పుట్టిపై వెళ్లి బావులపైనే మోటార్లకు మరమ్మతులు చేస్తున్నారు. నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నా.. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రజల దాహార్తి తీర్చేందుకు తమవంతు కృషి చేస్తున్నారు.

– ఈనాడు, కర్నూలు

మట్టికొట్టుకుపోయిన నాణ్యత




రహదారి పక్కన కొండను తవ్వి ఆ మట్టినే రహదారిపై వేస్తున్నారు.

కర్నూలు- ఆత్మకూరు(కేజీ రోడ్డు) మధ్య చేపడుతున్న జాతీయ రహదారి (340సి) విస్తరణ పనులు గాడితప్పాయి.. నన్నూరు టోల్‌ప్లాజా నుంచి ఆత్మకూరు వరకు 78 కి.మీ మేర నాలుగు వరుసలుగా విస్తరిస్తున్నారు. అడ్డగోలుగా కొండల్ని తవ్వేస్తూ.. ఆ మట్టి, రాళ్లను రహదారి నిర్మాణానికి ఉపయోగిస్తుండటం వివాదాస్పదంగా మారింది. అనుమతులు లేకుండా కొండలు తవ్వడం నిబంధనలకు విరుద్ధమని.. తవ్వాల్సి వస్తే తమ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని గతంలోనే గనుల శాఖ అధికారులు గుత్తేదారు సంస్థకు నోటీసులు జారీ చేశారు. కొండను తవ్వి రాళ్లు, మట్టి ఉపయోగించినందుకు గుత్తేదారు సంస్థకు భారీ అపరాధ రుసుము విధించింది. దీంతో రహదారి నిర్మాణం కోసం ప్రభుత్వం ఆ భూమిని తమకు అప్పగించిందని, తాము అనుమతులు తీసుకోవాల్సిన అవసరం లేదంటూ గుత్తేదారు సంస్థ హైకోర్టును ఆశ్రయించింది. తవ్వకాల్లో భాగంగా పేలుళ్లు జరపడంతో కొండ ప్రాంతమంతా కదిలిపోయింది. భవిష్యత్తులో రహదారిపై కొండచరియలు విరిగిపడే ప్రమాదం పొంచి ఉంది.

కొండల్ని పేల్చి పిండి చేస్తున్నారు

రహదారి నిర్మాణానికి అవసరమైన మట్టి కోసం గనులశాఖ నుంచి గుత్తేదారు సంస్థ అనుమతులు తీసుకుంది. వారికి కేటాయించిన ప్రాంతంతో పాటు దాని పరిసర ప్రాంతాల్లోనూ ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు సాగిస్తున్నారు. మట్టి, రాళ్ల కోసం కొండల్ని పిండి చేస్తున్నారు. సుమారు వంద అడుగుల ఎత్తు వరకు కొండను నిటారుగా తవ్వేస్తుండటంతో భారీ వర్షాలు కురిస్తే మిగిలిన భాగం కుప్పకూలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రహదారి నిర్మాణంలో రకరకాల రాళ్లు, మట్టి, కంకర ఉపయోగిస్తున్నారు.



పరిశీలన

నాణ్యత 'సుద్ద' అబద్ధం

ఎస్సార్బీసీ కాల్వ తవ్వినప్పుడు వచ్చిన ఎర్రబిలుకును రోడ్డు నిర్మాణంలో వాడేందుకు గుత్తేదారు సంస్థ అనుమతులు తీసుకుంది. పాములపాడు మండలం ఎర్రగూడూరు ప్రాంతంలోని ఎర్రబిలుకును ఇందుకు ఉపయోగిస్తున్నారు. ఈ ఎర్రబిలుకునే సుద్దరాయని పిలుస్తారు. దీనిని ఉపయోగించడం వల్ల రహదారి రహదారి కుంగిపోతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జాతీయ రహదారుల సంస్థ అధికారులు స్పందించి ఎన్‌హెచ్ 340సి పనులను పూర్తిస్థాయిలో తనిఖీ చేసి నాణ్యతను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

ఆగిన అనుసంధానం

నంద్యాల చెక్‌పోస్టు నుంచి జాతీయ రహదారి వరకు 9 కి.మీ మేర నాలుగు వరుసల అనుసంధాన రహదారిని కూడా ప్రభుత్వం చేపట్టింది. గతేడాది ఆ పనులు మొదలుపెట్టారు. ఇప్పటి వరకు 2.7 కిలోమీటర్ల దూరం మాత్రమే నిర్మాణం పూర్తి చేశారు. భూములు ఇచ్చిన వారికి పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించలేదు. ఇప్పటి వరకు రూ.2.30 కోట్లు చెల్లించారు. ఇంకా రూ.10.70 కోట్లు భూ యజమానులకు చెల్లించాల్సి ఉంది. దీంతో మరో 6.3 కిలోమీటర్లు రహదారి నిర్మాణం నిలిచిపోయింది. పరిహారం మొత్తం చెల్లిస్తేగాని ఈ పనులు మళ్లీ మొదలయ్యే పరిస్థితి లేదు.

134 మంది ఉపాధ్యాయులకు తాఖీదులు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: జిల్లా పరిధిలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న 134 మంది బోధన, బోధనేతర ఉపాధ్యాయులు సరైన సమయంలో ముఖ హాజరు వేయకపోవడంతో డీఈవో శామ్యూల్ మంగళవారం తాఖీదులు జారీ చేశారు. రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలని కోరారు.

లోపలి పేజీల్లో

దంపతుల విరాళం.. కన్నయ్యకు దివ్యాలయం

చేజారనివ్వరు

6లో

నవోదయలో ప్రవేశాలకు గడువు పెంపు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-2026 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశ పరీక్షల దరఖాస్తుకు గడువు పెంచినట్లు బనవాసి జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపల్ పద్మావతి మంగళవారం తెలిపారు. అక్టోబరు 7 వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.



ఎంపీ నాగరాజు, తెదేపా నేత రాఘవేంద్రరెడ్డి తదితరులు

పాలన అంటే ఏంటో వంద రోజుల్లోనే చేసి చూపించారు - ఎంపీ

మంత్రాలయం , న్యూస్‌టుడే : పాలన అంటే ఏంటో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వంద రోజుల్లోనే చేసి చూపించారని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. మంత్రాలయం మండలం చిలకలదోణలో మంగళవారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాఘవేంద్రరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, లక్ష్మన్నలతో కలిసి ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మణిమంజరి, సీఐ రామాంజులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జడ్పీలో బదిలీ చిచ్చు

■ ఛైర్మన్.. సీఈవో మధ్య వివాదం
■ వేర్వేరుగా ఎంపీడీవోల జాబితా రూపకల్పన

కర్నూలు జడ్పీ, న్యూస్‌టుడే :

మండల అభివృద్ధి అధికారుల (ఎంపీడీవో) బదిలీ ప్రక్రియ చిచ్చు పెట్టింది.. జిల్లా పరిషత్ అధ్యక్షుడు (ఛైర్మన్) పాపిరెడ్డి, సీఈవో నాసరరెడ్డిలు ఎవరికివారు వేర్వేరుగా జాబితాలు రూపొందించారు.. తాము నిర్ణయించిన పేర్లే ఖరారు కావాలంటూ ఇద్దరూ భీష్మించుకోవడంతో సమస్య ముదిరి పాకాన పడింది.. 40 మందితో కూడిన జాబితాను సోమవారం రాత్రి 11 గంటలకు జడ్పీ ఛైర్మన్ విడుదల చేశారు. 42 మందితో ఉన్న జాబితాను సీఈవో విడుదల చేశారు. రెండు జాబితాలు విరుద్ధంగా ఉండటం.. కొలిక్కిరాకపోవడంతో ఎంపీడీవోల బదిలీలకు ఆటంకం ఏర్పడింది. అధికారులు రూపొందించిన జాబితాను ఛైర్మన్ పక్కన పెట్టడంపై 'కూటమి' నేతలు మండిపడుతున్నారు.. బదిలీల్లో 'వైకాపా' నేతలు పెత్తనం చేస్తుండటంపై వారు గుర్రుగా ఉన్నారు.

ఎంపీడీవోల బదిలీలకు సంబంధించి గత పది రోజులుగా జడ్పీ ఛైర్మన్, సీఈవో, ఉప సీఈవో కసరత్తు చేస్తున్నారు. నేతల సిఫార్సు లేఖల మేరకు ప్రాధాన్య మండలాలు కేటాయించాలి.. పాలన సాఫీగా నడిచేలా సహకరించాలని జడ్పీ ఛైర్మన్‌ను సీఈవో కోరారు. ఇంతవరకు బాగానే ఉన్నా కొన్ని మండలాలకు తనకు నచ్చని పేర్లు ఎలా ప్రతిపాదిస్తారు.. తన అనుమతి లేకుండా జాబితా ఎలా తయారు చేస్తారంటూ జడ్పీ ఛైర్మన్ ప్రశ్నించడంతో గత రెండు రోజులుగా వారిద్దరి మధ్య మనస్పర్థలు నెలకొన్నాయి. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలకే ప్రాధాన్యమిస్తున్నారు.. తాను ప్రతిపాదించిన పేర్లను సీఈవో పట్టించుకోవడం లేదని ఛైర్మన్ మండిపడుతున్నారు. అధికార పార్టీ నేతలకు విలువ ఇవ్వకుండా తాను ఎలా బాధ్యతలు నిర్వర్తించగలనని.. ఛైర్మన్ ప్రతిపాదించిన కొన్ని పేర్లను అంగీకరించి జాబితాలో చేర్చామని సీఈవో పేర్కొంటున్నారు.



పేరు	సీఈవో ప్రతిపాదన	ఛైర్మన్ ప్రతిపాదన
చంద్రశేఖర్	పాములపాడు	గోనెగండ్ల
వెంకటరమణ	బనగానపల్లి	పెద్దకడబూరు
ఫజుల్ రహమాన్	బేతంచెర్ల	డోన్
షేక్ అమానుల్లా	ఆలూరు	రుద్రవరం
సుమిత్రమ్మ	మంత్రాలయం	పాములపాడు
పుల్లయ్య	నందవరం	బనగానపల్లి
వరప్రసాద్‌రావు	కోవెలకుంట్ల	కోసిగి
భాగ్యమ్మ	రుద్రవరం	నందవరం
సోల్‌మన్	సంజామల	ఉయ్యాలవాడ

ఛైర్మన్ జాబితాలో లేని ఎంపీడీవోల వివరాలు

★ జి.వెంగన్న బేతంచెర్ల నుంచి కొలిమిగుండ్ల
★ జి.వెంకటేశ్వరరెడ్డి అవుకు నుంచి డోన్
★ మణిమంజరి మంత్రాలయం నుంచి గోనెగండ్ల

ప్రజాశ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రజాశ్రేయస్సే ఎన్డీయే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి పేర్కొన్నారు. ముజఫర్‌నగర్‌లో మంగళవారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం ముజఫర్‌నగర్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. స్థానికులు ఆమె దృష్టికి తీసుకొచ్చిన డ్రైనేజీ, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని నగరపాలక అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. నంద్యాల జిల్లా తెదేపా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ తదితరులు ఉన్నారు. 36వ వార్డులో తెదేపా సీనియర్ నాయకుడు చంద్ర కళాధర్‌రెడ్డి, రాఘవేంద్రనగర్‌లో తెదేపా బీసీ యాదవ సాధికారిక సమితి రాష్ట్ర కన్వీనర్ నాగేశ్వరరావు యాదవ్, వార్డు ఇన్‌ఛార్జి శైలజా యాదవ్ కార్యక్రమం నిర్వహించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

దంపతుల విరాళం..
కన్నయ్యకు దివ్యాలయం

☛ హోసూరులో శ్రీకృష్ణుడి ఆలయ నిర్మాణం

☛ వృద్ధుల విరాళంతో పుంజుకున్న పనులు

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆ దంపతులు మలిసంధ్యవేళ మంచి నిర్ణయం తీసుకున్నారు. డబ్బు ఉన్నా.. సాయం చేసే మనసు అందరికీ ఉండదు. అలాగని వీరికి కోట్ల ఆస్తులేమీ లేవు. కానీ సాయం చేయాలనే మనసు ఉంది. తండ్రి వారసత్వంగా వచ్చిన కొంత పొలం తప్ప ఇతర ఆదాయ మార్గాలేవీ లేవు. వయసు మీదపడింది. ఊరికి ఏదో మంచి చేయాలని సంకల్పించారు. ఆలయ నిర్మాణానికి లక్షలు విరాళంగా ఇచ్చారు. గ్రామంలో ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్నారు వృద్ధ దంపతులు మాలగొండ రోశన్న, జయమ్మ దంపతులు.


శిథిలావస్థలో వారి ఇల్లు

ఏళ్ల తరబడి ఎదురు చూపులు

రోశన్న, జయమ్మ దంపతులకు వృద్ధాప్యంలో ఆరోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. ఉన్న ఎనిమిదెకరాల్లో ఐదెకరాల పొలాన్ని రూ.90 లక్షలకు విక్రయించారు. వచ్చిన దాంట్లో గ్రామంలో శ్రీకృష్ణాలయ నిర్మాణానికి రూ.65 లక్షల విరాళం అందించారు. వారు అందించిన భూరి విరాళంతో ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. యాదవులు అధికంగా ఉన్న హోసూరులో వారి ఆరాధ్య దైవమైన శ్రీకృష్ణాలయం నిర్మించాలని ఎన్నో ఏళ్లుగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఆర్థిక వనరులు సమకూరక ఇబ్బందులు పడుతున్న యాదవ సంఘం పెద్దలకు తామున్నామని ముందుకొచ్చారు వృద్ధ దంపతులు.


హోసూరులో నిర్మిస్తున్న శ్రీకృష్ణాలయం

ఎన్నో ఏళ్ల కల నెరవేరుతోంది

- మాలగొండ రోశన్న, జయమ్మ, దాతలు



ఎన్నో ఏళ్లుగా గ్రామంలో శ్రీకృష్ణుడి ఆలయం నిర్మించాలని సంఘం పెద్దలు అనుకుంటున్నారు. అది కార్యరూపం దాల్చలేదు. ఆలయ నిర్మాణం అంటే రూ.లక్షల్లో వ్యవహారం. వారు వీరు ఇచ్చే వేల రూపాయలు ఏ మూలకూ సరిపోవు. ఎన్ని ఆస్తులున్నా, ఎంత డబ్బు ఉన్నా ఎవరూ వెంట తీసుకెళ్లలేరు. గ్రామంలో ఓ ఆలయం రూపుదిద్దుకొని, ఆధ్యాత్మిక భావాలు పెంపొందుతాయంటే.. అంతకన్నా మానసిక ఆనందం ఏముంటుంది. అందుకనే నా భార్య జయమ్మతో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నాం.

భూమిని నమ్ముకొనే జీవనం

పత్తికొండ మండల పరిధిలోని హోసూరు గ్రామానికి చెందిన మాలగొండ రోశన్న, జయమ్మ దంపతులకు సంతానం లేదు. రోశన్నకు ఉన్న ఇద్దరు సోదరులు వేరువేరుగా ఉంటారు. వారి భాగానికి వచ్చిన 12 ఎకరాల పొలాన్ని నమ్ముకొని ఇన్నాళ్లూ జీవనం సాగించారు. ప్రస్తుతం ఏడు పదుల వయసులో ఉన్న ఈ దంపతులు ఏ పనీ చేయలేక పోతున్నారు. కొన్నేళ్లు భూమిని కౌలుకు ఇచ్చి వచ్చిన డబ్బుతో కాలం గడుపుతున్నారు. కొంత కాలంగా ఇద్దరినీ జబ్బులు వెంటాడుతున్నాయి. చికిత్స నిమిత్తం రూ.లక్షలు ఖర్చు చేశారు. మధ్యలో కొంత పొలాన్ని అమ్మి అప్పులు తీర్చారు. ఇటీవల మరికొంత అమ్మగా వచ్చిన సొమ్ములో కొంత వారితో ఉంచుకొని రూ.65లక్షలకు పైగా ఆలయ నిర్మాణానికి విరాళం అందజేశారు. శిథిలావస్థకు చేరిన తమ సొంత ఇంటిని సైతం మరమ్మతులు చేసుకోకుండా ఆలయ నిర్మాణానికి విరాళం ఇచ్చి దాతృత్వం చాటుకున్నారు. భర్త రోశన్న తీసుకున్న నిర్ణయానికి భార్య జయమ్మ సైతం సుముఖత వ్యక్తం చేసి ఆదర్శ దంపతులుగా నిలిచారు. వృద్ధ దంపతులు తీసుకున్న ఈ నిర్ణయాన్ని పలువురు ప్రశంసిస్తున్నారు. ప్రస్తుతం దాత రోశన్న దగ్గర ఉండి ఆలయ నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్నారు.

హైకోర్టు బెంచ్ ఏర్పాటు నిర్ణయంపై హర్షం

కర్నూలు న్యాయవిభాగం, న్యూస్‌టుడే: కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో తెదేపా లీగల్ సెల్, కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ నాయకులు, న్యాయవాదులు స్థానిక అసోసియేషన్ కార్యాలయం వద్ద మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి భరత్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకొన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణమూర్తి, కార్యదర్శి రవికాంత్‌ప్రసాద్, తెదేపా లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దాశెట్టి శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షులు జగదీశ్, కార్యదర్శి నాగమునిలు మాట్లాడుతూ హర్షం వ్యక్తం చేశారు.

● జూనియర్ న్యాయవాదులకు రూ.10 వేలు స్టైఫెండ్ ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంపై సందర్భంగా జిల్లా న్యాయవాదుల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు నిర్ణయం అభినందనీయమన్నారు. సంఘం అధ్యక్షులు కృష్ణమూర్తి, కార్యదర్శి రవికాంత్‌ప్రసాద్ త్రివిక్రమ్, న్యాయవాదులు పాల్గొన్నారు.


చంద్రబాబు, టీజీ భరత్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న న్యాయవాదులు

జలదరింపే





దెబ్బతిన్న ట్యాంకు మెట్లు




మాసా మసీదు ప్రాంతంలో కనరాని శుభ్రత తేదీలు

కర్నూలు నగరంతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్న పలు ఓవర్‌హెడ్ ట్యాంకులు అపరిశుభ్రంగా ఉన్నాయి. తాగునీరు కలుషితమవుతుండటంతో జనం రోగాల బారిన పడుతున్నారు. ట్యాంకుల్లో నీరు పాచి పట్టినా.. పైపులు తుప్పు పట్టినా పట్టించుకోవడంలేదు. కొన్ని ట్యాంకుల పైకి వెళ్లేందుకు ఏర్పాటుచేసిన నిచ్చెనలు దెబ్బతిని ప్రమాదకరంగా ఉన్నాయి. చివరికి అపరిశుభ్రమైన నీటినే జనం తాగుతున్నారు. పలు ప్రాంతాల్లో అతిసారం ప్రబలి పలువురు ప్రాణాలు కోల్పోతున్నా అధికారులు దృష్టి సారించడం లేదు.

- ఈనాడు, కర్నూలు


పంచలింగాల ఓవర్‌హెడ్ ట్యాంకులో పాచి పట్టిన నీరు.. తుప్పుపట్టిన పైపులతో అపరిశుభ్రంగా..


కాలువ పక్కనే మంచినీటి పైపులు

పరిపాలన భవనం.. స్వచ్ఛత కనం


డీఈవో కార్యాలయం ఎదుట వ్యర్థాలు


జిల్లా పరిపాలన భవన ఆవరణలో అధ్వానంగా ఉద్యానవనం


కలెక్టరేట్ ప్రాంగణంలో..

రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 17 నుంచి స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం ప్రారంభమైంది. ఇందులో భాగంగా పెద్దఎత్తున పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు. చెత్తాచెదారాలు తొలగిస్తున్నారు. కలెక్టరేట్‌లోని పలు కార్యాలయాల వద్ద పరిస్థితి అధ్వానంగా ఉంది. ఆవరణలోని ఉద్యానవనంలో పిచ్చిమొక్కలు పెరిగిపోయి విష పురుగులకు ఆవాసంగా మారింది. మట్టి కుప్పలు, చెత్త పెద్దఎత్తున ఉన్నా తొలగించకపోవడం గమనార్హం. **- ఈనాడు, కర్నూలు**


నెడ్‌క్యాప్, వయోజన విద్య కార్యాలయాల ఎదుట మట్టికుప్పలు

19 మండలాల్లో కురిసిన వర్షం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : జిల్లాలో సోమవారం నుంచి మంగళవారం ఉదయం వరకు పలు మండలాల్లో వర్షం పడింది. అత్యధికంగా నందవరం మండలంలో 95.0 మి.మీ.గా నమోదైంది. కల్లూరు 53.8, మంత్రాలయం 47.4, ఎమ్మిగనూరు 44.2, కర్నూలు గ్రామీణం 36.2, కర్నూలు అర్బన్ 35.4, గోనెగండ్ల 34.4, గూడూరులో 22.6 మి.మీ.లు కురిసింది. వెల్దుర్తి 17.2, కోడుమూరు 14.8, కోసిగి 14.6, కృష్ణగిరి 8.8, పెద్దకడబూరు 8.6, పత్తికొండలో 1.0 మి.మీ. పడింది. జిల్లా సగటున 17.4 మి.మీ.గా ఉంది. పశ్చిమ ప్రాంతంలో భారీ వర్షం కురవడంతో కల్లూరు వద్ద వక్కెర వాగు పొంగింది. హంద్రీ నదికి జలకళ వచ్చింది. పలు ప్రాంతాల్లో పంటలు నీట మునిగాయి.



కర్నూలు వద్ద హంద్రీ నదిలో ప్రవాహం

చేజారనివ్వరు

☛ సెల్‌ఫోన్ రికవరీల్లో సైబర్‌ల్యాబ్ కీలకపాత్ర

☛ వేల సంఖ్యలో బాధితులకు అప్పగింత

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : చరవాణి.. ఇది నిత్యం ప్రతి మనిషి వెన్నంటే ఉండే ఎలక్ట్రానిక్ ఉపకరణం. బ్యాంకు ఖాతా మొదలుకొని వ్యక్తిగత, రహస్య సమాచారం నిల్వ చేసుకునే ఎలక్ట్రానిక్ డైరీగా, ల్యాప్‌టాప్‌గా, టీవీగా.. ఇలా పలు విధులుగా ఉపయోగపడుతోంది. నగదు వెంట తీసుకెళ్లాల్సిన అవసరం లేకుండా అంతర్జాల సేవలతో ఒకరికొకరు పంపుకొనే సౌకర్యముంది. అలాంటి చరవాణి అపహరణ గురైనా.. ఎక్కడైనా పోగొట్టుకున్నా కలిగే బాధ వర్ణణాతీతం. ప్రస్తుతం చరవాణి దొంగతనాలు ఎక్కువయ్యాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో వేల సంఖ్యలో అపహరణకు గురవుతున్నాయి. ఫలితంగా ఎందరో బాధితులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. అలాంటి వారికి సాంత్వన కలిగించేలా పోలీసు అధికారులు చర్యలు చేపట్టారు. ఏటా వందల సంఖ్యలో చరవాణులను రికవరీ చేసి అప్పగిస్తున్నారు. బాధితులు ఆన్‌లైన్ ద్వారా పంపే వివరాలతో పోలీసులు దర్యాప్తు చేపట్టి చరవాణిని గుర్తించి వాటిని స్వాధీనం చేసుకుంటున్నారు.



మేళా ద్వారా బాధితులకు అందజేసిన చరవాణుల వివరాలు

సం॥	నెల	రికవరీ
2023	జనవరి	1,042
2023	జూన్	652
2023	నవంబర్	652
2024	సెప్టెంబర్	587

సాంకేతిక పరిజ్ఞానంతో..

చరవాణుల రికవరీల్లో కర్నూలు జిల్లా కేంద్రంలోని రీజనల్ సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్ సాంకేతిక నిపుణులు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బృంద సభ్యులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి చరవాణిని ఎవరు ఉపయోగిస్తున్నారో గుర్తించి వారి నుంచి రికవరీ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. పొరుగు జిల్లాలు, ఇతర రాష్ట్రాల్లో ఉన్న వ్యక్తుల నుంచి సైతం చరవాణులను రికవరీ చేస్తుండటం విశేషం. ఎవరైనా చరవాణులు పోగొట్టుకున్న బాధితులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ బిందుమాధవ్ పేర్కొంటున్నారు.

చోరీకి గురైతే ఏం చేయాలి..

సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితులు http:kurnoolpolice.in/mobiletheft లింకును క్లిక్ చేయాలి. తెరపై కనిపించే దరఖాస్తులో పేరు, చిరునామా, చరవాణి నంబరు, స్థానిక పోలీసుస్టేషన్, ఐఎంఈఈ నంబరుతో సహా అవసరమైన వివరాలు నమోదు చేయాలి.

ఇద్దరు వీఆర్వోల స్థానాలు మార్పు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: రెవెన్యూ బది'లీలలు' శీర్షికతో ఈనెల 23న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. బదిలీల్లో జరిగిన తప్పులు సరిదిద్దేలా చర్యలు చేపట్టారు. కృష్ణగిరి మండలం నుంచి స్థానికంగా సొంత గ్రామానికి బదిలీ అయిన వీఆర్వో మీసాల మద్దిలేటిని తిరిగి కృష్ణగిరికి బదిలీ చేశారు. మరో వీఆర్వో రామకృష్ణను ముడుములగుర్తి నుంచి కోడుమూరు-4 స్థానానికి మార్చారు. కల్లూరు మండలం తహసీల్దారు కార్యాలయంలో బదిలీల ప్రక్రియ గందరగోళంగా మారింది. పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న వీఆర్వో సూర్యబాబును కోడుమూరు మండలానికి బదిలీ చేశారు. ఆ తర్వాత రెండు రోజులు తిరగక ముందే తిరిగి కల్లూరుకు బదిలీ అవడం గమనార్హం. కల్లూరులో కుటుంబ సభ్యుల పత్రం జారీ చేసే విషయంలో ఓ వీఆర్వో రూ.2 లక్షలు తీసుకొని అనర్హులకు పత్రం చేశారన్న ఆరోపణలున్నాయి. బదిలీల్లో ఆయన్ను కోరుకున్న స్థానానికి నియమించడం గమనార్హం.

నగరపాలకలో బదిలీలు

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: కర్నూలు నగరపాలక ఇంజినీరింగ్ విభాగంలో డీఈ, ఏఈలు బదిలీ అయ్యారు. డీఈలు రాజశేఖర్ ఆదోని పురపాలక, రవిప్రకాష్‌నాయుడు రాయదుర్గం పురపాలక, గోపాలకృష్ణమూర్తి ఏపీఎంఎస్ఐడీసీ మంగళగిరికి బదిలీ అయ్యారు. ఏఈలు దినేష్‌కుమార్ నందికొట్కూరుకు, జనార్దన్ ఆదోనికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కుడా డీఈ నాసిర్‌ను నందికొట్కూరుకు బదిలీ కాగా.. నందికొట్కూరు పురపాలక డీఈ నయబ్ రసూల్ కుడాకు బదిలీ అయ్యారు. కర్నూలు నగరపాలక ఏఈగా సీవీఆర్ వైష్ణవి, డీఈలుగా గంగాధర్, శ్రీనివాసరెడ్డి, మనోహర్‌రెడ్డిలను బదిలీ చేశారు.

డ్వామా పీడీగా జి.శివప్రసాద్

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా డ్వామా పీడీగా జి.శివప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

ఉరుకుంద ఆలయ ఈవోగా విజయరాజు

మంత్రాలయం గ్రామీణం (కౌతాళం), న్యూస్‌టుడే : కౌతాళం మండలం ఉరుకుంద ఆలయ ఈవోగా విజయరాజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడలో డిప్యూటీ కమిషనరుగా విధులు నిర్వహించిన ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చినట్లు చెప్పారు. ముందుగా నూతన ఈవో ఈరన్న స్వామిని దర్శించుకున్నారు. అనంతరం తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈవోను తెదేపా నాయకులు కొట్రేష్‌గౌడు, కురుగోడు, సురేంద్ర తదితరులు సత్కరించారు. కార్యక్రమంలో ఆలయాధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న విజయరాజు

పర్యాటక ప్రాంతాలకు రహదారుల నిర్మాణం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : పర్యాటక అభివృద్ధిలో భాగంగా జిల్లాలో పర్యాటక ప్రాంతాలకు రూ.3.33 కోట్లతో రహదారులు మంజూరు చేసినట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబరులో పర్యాటక ప్రాంతాలకు సంబంధించిన డిస్‌ప్లే బోర్డులను మంగళవారం ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పర్యాటక ప్రాంతాలు, ఎకో టూరిజం ప్రదేశాలు, హెరిటేజ్ టూరిజం ప్రాంతాల వివరాలు ప్రజలకు సమగ్రంగా తెలిసేలా ప్రదర్శన బోర్డులు ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు. గార్గేయపురం, జగన్నాథగట్టు, కేతవరం గుహలు, ఉరుకుంద, అశోకుడి శిలా శాసనాలు, సుంకేసుల, రూపాల సంగమేశ్వరస్వామి, హరిత రాక్ గార్డెన్ ప్రాంతాలకు రహదారులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారిణి విజయ పాల్గొన్నారు.


పర్యాటక ప్రాంతాలను తెలిపే బోర్డును పరిశీలిస్తున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా

నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలి

స్వర్ణాంధ్ర 2047 దార్శనికత పత్ర రూపకల్పనలో భాగంగా క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా ప్రజల అభిప్రాయాలు సేకరించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించాలని, ఇంటింటికీ వెళ్లి విజన్ డాక్యుమెంట్ అందించి అన్నివర్గాల నుంచి తమ స్మార్ట్ ఫోన్ ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేయించి వారి అభిప్రాయాలు పొందుపరిచేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలకు సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 426 గ్రామసభలు నిర్వహించగా 90 వేల మంది ప్రజలు పాల్గొన్నట్లు చెప్పారు.

ఓటరు దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వంద శాతం పరిష్కరించాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా ఆదేశించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ అంశంపై నియోజకవర్గ ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో ఆయన మంగళవారం టెలీ కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. జిల్లాలో ఇంటింటి ఓటరు జాబితా పరిశీలన సగటున 98.31 శాతం పూర్తైందని చెప్పారు. పలు అంశాలపై మాట్లాడారు. ఈ టెలీ కాన్ఫరెన్సులో జేసీ డా.బి.నవ్య, ఆదోని, కర్నూలు, పత్తికొండ, కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు, ఈఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

గోనెగండ్ల, న్యూస్‌టుడే : అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం జరిగింది. గోనెగండ్ల సీఐ గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం.. నందవరం మండలంలోని కనవీడు పేట గ్రామానికి చెందిన బోయ సీతారాముడు (32) ఇంటి నిర్మాణానికి రూ.8 లక్షలు అప్పులు చేశారు. ఎలా తీర్చాలో తెలియక మనస్తాపానికి గురై గోనెగండ్లకు దశమికి వెళ్లిన తన తండ్రి లచ్చన్నకు ఫోన్‌చేసి ఏమైనా చేసుకొని చనిపోతానని చెప్పారు. ఎక్కడ ఉన్నావని తండ్రి ఎన్నిసార్లు ఫోన్ చేసినా సమాచారం ఇవ్వలేదన్నారు. కుటుంబ సభ్యులు ఇంటికి వెళ్లి విచారించగా అప్పటికే పక్క గ్రామమైన పెద్దమర్రివీడు గ్రామ శివార్లో ఓ చెట్టుకు ఉరేసుకొని మృతిచెందారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.


బోయ సీతారాముడు (పాత చిత్రం)

ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు

పెద్దకడబూరు, న్యూస్‌టుడే : పెద్దకడబూరులోని ఆది ఆంధ్ర ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయుడు సుప్రసాద్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నిరంజన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ప్రధానోపాధ్యాయుడు 2024 ఆగస్టులో పాఠశాలలో విద్యార్థినులకు చరవాణి ద్వారా అసభ్యకర వీడియోలను చూపించారని మండల విద్యాధికారి సువర్ణల సునియం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

ఆదోని

• ఆదోని • ఆలూరు • పత్తికొండ

సమస్యాత్మక గ్రామాలపై నిఘా తప్పనిసరి

వెల్దుర్తి, న్యూస్‌టుడే: సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఎస్పీ బిందుమాధవ్ పోలీసులను ఆదేశించారు. చెరుకులపాడులో మంగళవారం ఆయన ఆకస్మికంగా పర్యటించారు. గ్రామంలో పికెటింగ్ నిర్వహిస్తున్న పోలీసులతో ఆయన మాట్లాడారు. గ్రామంలోని పరిస్థితులపై ఆరా తీశారు. ఆయన వెంట సీఐ మధుసూదన్‌రావ్‌కు సూచించారు.



పికెటింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ బిందు మాధవ్

పోలీసు స్టేషన్ తనిఖీ: కృష్ణగిరి, న్యూస్‌టుడే: కృష్ణగిరి పోలీసు స్టేషన్‌ను ఎస్పీ జి.బిందుమాధవ్ మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేసుల వివరాలను ఎస్సై కె.మల్లికార్జునను అడిగి తెలుసుకున్నారు.

వసూళ్లకు పాల్పడితే చర్యలు

పత్తికొండ పట్టణం, న్యూస్‌టుడే: పత్తికొండ పట్టణంలోని వివిధ దుకాణ యజమానుల నుంచి బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్న హిజ్రాలపై చర్యలు తప్పవని పత్తికొండ సీఐ జయన్న అన్నారు. మంగళవారం వారిని పత్తికొండ పోలీసు స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. శివారు ప్రాంతంలో వాహనదారుల నుంచి వసూళ్లకు పాల్పడటం, దుర్భాషలాడటం చేయరాదన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆదోని: 77996 66004
ఆలూరు: 80085 62277
పత్తికొండ: 8008573822

ఆలూరు, న్యూస్‌టుడే: **సమస్య:** ఆలూరు కోయనగర్ కాలనీకి వెళ్లే మార్గంలో బాలికల వసతిగృహం వద్ద చెత్తా చెదారం పేరుకుపోయింది. దుర్వాసన వస్తోంది. **- శ్రీనివాస్, ఆలూరు**

సమాధానం: పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందిని పంపి చెత్తను తొలగించేలా చూస్తాం. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా ప్రజలు సహకరించాలి. **- అరుణాదేవి, సర్పంచి, ఆలూరు**

హొళగుంద, న్యూస్‌టుడే: **సమస్య:** సమ్మతగేరి గ్రామంలో మారెమ్మ ఆలయానికి వెళ్లే ప్రధాన మార్గంలో మురుగునీరు పారుతోంది. చుట్టు పక్కల నీరుచేరి దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. **- మంజునాథ్, సమ్మతగేరి**

సమాధానం: పారిశుద్ధ్య పనులు చేపట్టి, సమస్య పరిష్కరిస్తాం. **- రంగస్వామి, పంచాయితీ కార్యదర్శి, సమ్మతగేరి**

పల్లె కబుర్లు

నాగలాపురం(ఆదోని గ్రామీణం), న్యూస్‌టుడే: ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి ఒంటెద్దు పోకడ మంచిది కాదని, అందరినీ కలుపుకొని పోవాలని ఆదోని భాజపా సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్ అన్నారు. నాగలాపురం గ్రామంలో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమం నిర్వహించారు. ఆదోనిలో ఎమ్మెల్యేను అందరం కష్టపడి గెలిపించామన్నారు. కూటమికి కట్టుబడి ఉండాలన్నారు.

నాగనాథనహళ్లి(ఆదోని గ్రామీణం), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లోనే వంద సంక్షేమ అమలు చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు దక్కుతుందని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. ఆదోని మండలం నాగనాథనహళ్లి గ్రామంలో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ, జనసేన బాధ్యుడు మల్లప్ప, ఎంపీడీవో గీతావాణి, తహసీల్దారు శివరాముడు, సర్పంచి వరదప్ప, ఇస్వీ ఎస్సై నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

చిప్పగిరి, న్యూస్‌టుడే: పరోపకారమే ఎన్ఎస్ఎస్ లక్ష్యమని జేవీవీ రాష్ట్ర కార్యదర్శి డాక్టరు హరిప్రసాద్ యాదవ్ అన్నారు. చిప్పగిరి జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానాచార్యులు వరదరాజులు, అధ్యాపకులు సుబ్రమణ్యం, వసంత, కిరణ్మయి పాల్గొన్నారు.

కుప్పగల్(ఆదోని గ్రామీణం), న్యూస్‌టుడే: కుప్పగల్ సమీపంలో పాండవల్ గ్రామానికి చెందిన రామకృష్ణను అరెస్టు చేసి, అతని నుంచి 96 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు పెద్దతుంబళం ఎస్సై మహేష్‌కుమార్ మంగళవారం తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సలకలకొండ(ఆదోని గ్రామీణం), న్యూస్‌టుడే: సలకలకొండ గ్రామానికి చెందిన హైమావతిని అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త వీరేంద్ర, అత్త సుశీలమ్మ, మరో ఇద్దరిపై వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఆదోని తాలుకా ఎస్సై రామాంజనేయులు మంగళవారం తెలిపారు.

ఢణాపురం(ఆదోని గ్రామీణం), ఆస్పరి, న్యూస్‌టుడే: ఢణాపురం సమీపంలోని నగరూరు చెరువు కింద అక్రమంగా మోటార్లు పెట్టుకుని సాగు చేస్తున్న వారిపై అధికారులు చర్యలు చేపట్టారు. మంగళవారం అక్రమంగా నీటిని వినియోగిస్తున్న మూడు మోటార్లను పోలీసుల సహకారంతో తొలగించినట్లు ఆదోని చిన్ననీటి పారుదల ఏఈ షఫీ ఉల్లా తెలిపారు. బోర్లను కూడా తొలగిస్తామన్నారు. ఆదోని డీఈ చెన్నకేశవ్ నాయక్, వీఆర్వో, పోలీసులు పాల్గొన్నారు.

యార్డుకు భారీగా పత్తి దిగుబడులు

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు మంగళవారం రికార్డు స్థాయిలో పత్తి దిగుబడులు తరలివచ్చాయి. 12,504 క్వింటాళ్ల పత్తి అమ్మకానికి రాగా, క్వింటాలు కనిష్ఠంగా రూ.4,216, గరిష్ఠంగా రూ.7,625, మధ్య ధర రూ.7,489లు పలికాయి. సీజన్ ముందే పత్తి దిగుబడులు అధికంగా వస్తుండటంతో మార్కెట్‌కు పూర్వవైభవం సంతరించుకుంది. మరోవైపు పండగల సీజన్ కావడంతో రైతులు ధర ఉన్నప్పుడు పత్తి దిగుబడులు అమ్ముకోవాలనే ఆసక్తి కనబరుస్తున్నట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి.

లాభసాటి సేద్యంపై అవగాహన కల్పించాలి

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో రైతులకు లాభసాటి వ్యవసాయంపై అవగాహన కల్పించాలని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. పత్తికొండ శివారులోని ఓ పొలంలో వ్యవసాయాధికారులు మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పత్తికొండ వ్యవసాయ సహాయ సంచాలకులు మోహన్‌విజయ్‌కుమార్, మండల వ్యవసాయాధికారి వెంకటరాముడు, ఉద్యానశాఖాధికారి దస్తగిరి ఏపీ తెలుగు రైతు ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, తెదేపా నాయకులు సాంబశివారెడ్డి, బత్తినవెంకటరాముడు, మనోహర్‌చౌదరి, తిమ్మయ్యచౌదరి, శ్రీధర్‌రెడ్డి, సుధాకర్, చెన్నమనాయుడు, మీరాహుసేన్, కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

గోదాము తనిఖీ

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వెల్దుర్తి పౌరసరఫరాల గోదాంను సీఎస్‌డీటీ నవీన్ మంగళవారం తనిఖీ చేశారు. గోదాములోని స్టాకు వివరాలను పరిశీలించారు. తూకాల్లో ఎలాంటి తేడాలు ఉండరాదని గోదాము సిబ్బందికి సూచించారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

వెల్దుర్తి, న్యూస్‌టుడే: గ్రామాల్లో సమస్యలు పరిష్కరించి పారిశుద్ధ్యపనులు చేపట్టాలని డీపీవో నాగరాజునాయుడు అన్నారు. మల్లెపల్లి గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. నీటి ట్యాంకులను నిర్ణీత సమయాలలో శుభ్రం చేయించాలని ఈవోఆర్డీ నరసింహులుకు సూచించారు.

రైతు కుటుంబానికి ఆర్థిక సాయం

తుగ్గలి, న్యూస్‌టుడే: అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకొన్న కడమకుంట్ల గ్రామ రైతు రామచంద్ర కుటుంబానికి ప్రభుత్వం రూ.7 లక్షలు ఆర్థిక సాయం మంజూరు చేసినట్లు మండల వ్యవసాయాధికారి పవన్‌కుమార్ తెలిపారు. ఆర్థిక సాయం చెక్కును పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌కుమార్ చేతుల మీదుగా బాధిత రైతు భార్య సరస్వతికి మంగళవారం అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.

చెత్తతో సంపద.. చేయూతతో స్వచ్ఛత

☛ నిర్వహణలోకి తెచ్చేందుకు ప్రయత్నాలు

నియోజకవర్గం	చెత్త సంపద కేంద్రాలు	నిధులు
పత్తికొండ	87	రూ.2.5 కోట్లు
ఆదోని	37	రూ.1.01 కోట్లు
ఆలూరు	101	రూ.3.25 కోట్లు

ఆదోని గ్రామీణం, పత్తికొండ, మద్దికెర, ఆలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పల్లెల్లో పోగయ్యే చెత్త నుంచి సంపద సృష్టించాలనే లక్ష్యంతో గతంలో తెదేపా హయాంలో చెత్త సంపద కేంద్రాలను ఏర్పాటు చేసింది. అధికారంలోకి వచ్చిన వైకాపా వీటిని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. స్వచ్ఛ కార్మికులకు వేతనాలు సైతం ఇవ్వకుండా.. పంచాయతీలపైనే భారం మోపింది. దీంతో చెత్త సేకరణలో నిర్లక్ష్యంతో పాటు, కేంద్రాల పూర్తికి, వాటి నిర్వహణకు అవసరమైన నిధులు కేటాయించలేదు. దీంతో 90 శాతం కేంద్రాలు మూలనపడ్డాయి. పత్తికొండ, ఆలూరు, ఆదోని నియోజకవర్గాల పరిధిలోని కేంద్రాలను వినియోగంలోకి తెచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.



మద్దికెరలో వినియోగంలో ఉన్న చెత్త సంపద కేంద్రం

పూర్తయినా నిరుపయోగమే..



మద్దికెర మండలంలోని బొమ్మనపల్లిలో రెండేళ్ల కిందట ఈ చెత్తసంపద కేంద్రం నిర్మాణం పూర్తిచేశారు. అయినా ఇప్పటి వరకు ఇందులో ఎలాంటి సంపద సృష్టి జరగడం లేదు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో స్వచ్ఛ కార్మికులకు వేతనాలు చెల్లించే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో 90 శాతం కేంద్రాల ద్వారా ఎలాంటి ఆదాయం సమకూరక పోగా నిరుపయోగంగా మారాయి. మండలంలో 8 కేంద్రాలకు గాను మద్దికెర, అగ్రహారం, పెరవలి గ్రామాల్లో మాత్రమే వినియోగంలో ఉన్నాయి.

గత పాలకుల నిర్లక్ష్యం



ఆదోని మండలంలోని నారాయణపురం గ్రామంలో రెండేళ్లుగా పిల్లర్లకే పరిమితమైన చెత్త సంపద కేంద్రం ఇది. ఆదోని మండలంలో ఇప్పటికే రూ.కోటికి పైగా ఖర్చు చేసి నిర్మాణాలు పూర్తిచేసినా.. ఆ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. వైకాపా పాలనలో చెత్త సందప కేంద్రాల నిర్మాణాలను గాలికి వదిలేశారు. పూర్తయిన కేంద్రాలను వినియోగంలోకి తీసుకురాని పరిస్థితి. ఆదోని మండలంలో 40 పంచాయతీలు ఉండగా. 23 చెత్త సందప కేంద్రాలు పూర్తయ్యాయి. మరో 14 వివిధ దశల్లో ఉన్నాయి. మరో మూడు స్థల సమస్యతో ఇంత వరకు ప్రారంభం కాలేదు. పెసలబండ, దొడ్డనగేరి, హనువాళు గ్రామాలు ఇప్పటి వరకు ప్రారంభం కాని జాబితాలో ఉన్నాయి. పూర్తయిన వాటిని వినియోగంలోకి తేవడంలో అధికారులు విఫలం అయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఎరక్కపోతే.. ఇరుక్కుపోవాల్సిందే!



పత్తికొండ పట్టణంలోని టమాటా మార్కెట్ వైపు దారి బురదమయంగా మారింది. మార్కెట్‌కు కస్తూర్బా కళాశాల పక్కన అనుసంధానంగా ఉన్న ఈ దారిలో నిత్యం ఎన్నో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. చుట్టుపక్కల గ్రామాలైన చందోలి, చక్కరాళ్ళ, కురువలదొడ్డి, పలు తండాల రైతులు పంటల దిగుబడులను వాహనాల్లో తెస్తుంటారు. బురద దారిలో ఇరుక్కుపోతున్నాయి. మంగళవారం ఉదయం టమాటాలతో వెళ్లిన ఆటో ఇలా ఇరుక్కుపోయి, గేర్ బాక్స్ పగిలిపోవడంతో రైతులు నానా అవస్థలు పడ్డారు. ఇక్కడ సీసీ రోడ్డు వేయించాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, పత్తికొండ పట్టణం

తిరుమల లడ్డూను అపవిత్రం చేసిన వారిని శిక్షించాలి



కోట్ల కూడలిలో ఆందోళన చేస్తున్న హిందూ సంఘాలు

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూను అపవిత్రం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండు చేస్తూ ఆదోని పట్టణంలో హిందూ సంఘాలు మంగళవారం రాత్రి ఆందోళన చేపట్టారు. స్థానిక తిరుమల నగర్ వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి ర్యాలీ చేపట్టారు. ఇలాంటివి జరగకుండా ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ, వీహెచ్ఎన్ఎస్, వెంకటేశ్వరస్వామి పూజా భక్తబృందం, భాజపా, తదితర సంఘాల నాయకులు విట్టా రమేష్, రామాంజినేయులు, శివ, నాగరాజు, శ్రీనివాసాచారి, పొంపాపతి, మరియాని చెన్నబసప్ప తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభంలో సంక్షేమ ఫలాలు అందిస్తున్న ప్రభుత్వం



ఆదోని గ్రామీణం: నాగలాపురంలో మాట్లాడుతున్న తెదేపా బాధ్యుడు మీనాక్షినాయుడు

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో సంక్షోభ పరిస్థితులు ఉన్నా.. పేదలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్న గొప్ప పరిపాలన దక్షుడు ముఖ్యమంత్రి చంద్రబాబు అని తెదేపా ఆదోని నియోజకవర్గ బాధ్యుడు మీనాక్షినాయుడు అన్నారు. ఆదోని మండలం నాగలాపురం, మాంత్రికి గ్రామాల్లో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లు అతికించి, కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్ జైన్, తెదేపా సీనియర్ నాయకులు ఉమాపతినాయుడు, నాయకులు రామస్వామి, గోపాల్‌రెడ్డి, రంగస్వామి, దేవేంద్రప్ప, బసవరాజు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్‌కు మద్దతుగా ప్రాయశ్చిత్త దీక్ష

ఆదోని సాంస్కృతికం, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ తయారీలో అపవిత్రకు నిరసనగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన దీక్షకు మద్దతుగా ఆదోని ఎమ్మెల్యే డాక్టరు పార్థసారథి ఆదోనిలో మంగళవారం ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు. స్థానిక అభయ ఆంజనేయస్వామి దేవాలయంలో ఆలయ అర్చకుడు నుంచి ఎమ్మెల్యే పార్థసారథి దీక్షను స్వీకరించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ బాధ్యుడు మల్లప్ప, నాయకులు రేణువర్మ, రాజశేఖర్, నాగరాజుగౌడు తదితరులు పాల్గొన్నారు.



దీక్ష చేపడుతున్న ఆదోని ఎమ్మెల్యే డాక్టరు పార్థసారథి

జనసేన ఆధ్వర్యంలో సంప్రోక్షణ

తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ తయారీలో జరిగిన అపవిత్రతకు నిరసనగా ఆదోని పట్టణంలోని శ్రీ అభయ ఆంజనేయస్వామి దేవాలయంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో జనసేన పార్టీ బాధ్యుడు మల్లప్ప ఆధ్వర్యంలో సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టరు పార్థసారథి, మల్లప్ప ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: కూటమితో ఏర్పడిన మంచి ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలిచి, ఆశీర్వదించాలని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. మంగళవారం స్థానిక కార్వాన్ పేటలోని ఓ కల్యాణ మండపంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు పురపాలక ఛైర్‌పర్సన్ శాంత, తెదేపా రాష్ట్ర కార్యదర్శి భూపాల్‌చౌదరి, జనసేన బాధ్యుడు మల్లప్ప, తెదేపా మహిళా కార్యదర్శి గుడిసె కృష్ణమ్మ, పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పురపాలక సంఘం కమిషనర్ కృష్ణ, సహాయ కమిషనర్ డా.అనుపమ, తిమ్మప్ప, బుద్దారెడ్డి, వెంకటేష్, నాగరాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హొళగుంద, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వం సంక్షోభంలో ఉన్నా సంక్షేమంలో దూసుకెళ్తున్నాం అని ఆలూరు తెదేపా ఇన్‌ఛార్జి వీరభద్రగౌడ్ అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం ఎంపీడీవో సుహాసినమ్మ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. హొళగుందలోని బీసీ కాలనీలో ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వంలో చేపట్టిన పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో నాగేశ్వరరావు, ఏడీఏ వేదమణి, ఏడీ సునీత, ఏవో ఆనంద్ లోకదళ్, మేజర్ గ్రామపంచాయతీ సర్పంచి రంగమ్మ, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ గౌడ్, తెదేపా కూటమి జనసేన నాయకులు, పాల్గొన్నారు.



పథకాల గురించి వివరిస్తున్న ఆలూరు తెదేపా బాధ్యుడు వీరభద్రగౌడ్

సాగునీటి పథకాలు పూర్తిచేస్తా



తుగ్గలిలో కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

తుగ్గలి, న్యూస్‌టుడే: హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి కృష్ణా జలాలతో 68 చెరువులు నింపే పథకం పూర్తి చేసేందుకు రూ.2 కోట్లు కేటాయించాలని నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడిని కోరినట్లు పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. మంగళవారం తుగ్గలి గ్రామంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం గ్రామ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో సర్పంచి రవి, ఇన్‌ఛార్జి ఎంపీపీ ఎర్రనాగప్ప, మండల ప్రత్యేకాధికారి సుధాకర్‌రెడ్డి, ఎంపీడీవో సావిత్రి, పార్టీ నాయకులు తుగ్గలి నాగేంద్ర, బత్తిన వెంకటరాముడు, వెంకటస్వామి, మనోహర్‌చౌదరి, తిమ్మయ్యచౌదరి, తిరుపాల్‌నాయుడు, సత్య ప్రకాష్, మాజి ఎంపీపీలు వెంకటేష్, గురుస్వామి పాల్గొన్నారు.

మొక్కల్లో మెక్కేశారు

హాలహర్వి, న్యూస్‌టుడే: హాలహర్వి మండలంలో 17వ విడుత సమాజిక తనిఖీ బహిరంగ సభ మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. మండలంలో 2023 - 24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ, ఇతర శాఖల్లో జరిగిన పనులు మొత్తం 814 పనులకు గాను రూ.11,33,84,760 ఖర్చు చేశారు. ఇందుకు ఈ నెల 10 నుంచి 23 తేదీ వరకు 15 గ్రామ పంచాయతీల్లో సమాజిక తనిఖీ బృందం విచారణ చేపట్టింది. ఇందుకు సంబందించి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి మండల కేంద్రంలో బహిరంగ సభలో వివరాలు వెల్లడించారు. కార్యక్రమంలో సహాయ పీడీ మాధవీలత, క్లస్టర్ ఏపీడీ పద్మవతి, ఏపీవో ఆదినారాయణ, ఎస్ఆర్పీ విజయ్‌బాస్కర్ పాల్గొన్నారు.

సామాజిక సేవలో భాగస్వాములు కావాలి

పత్తికొండ పట్టణం, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి సామాజిక సేవా కార్యక్రమంలో భాగస్వామి కావాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. పత్తికొండలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ మాధురి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో భాగంగా అధ్యాపకులు రామకృష్ణ, రాజశేఖర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కర్నూలు ఎం.పి. నాగరాజు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మద్దికెర, న్యూస్‌టుడే: సైబర్ నేరాలు, సెల్‌ఫోన్ల చోరీ తదితర వాటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ పులిశేఖర్, ఎస్సై విజయ్‌కుమార్ అన్నారు. మద్దికెరలో మంగళవారం వారు స్థానిక ప్రధాన కూడలిలో అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం వల్ల ఎంతో మంది ప్రమాదాలకు గురవుతున్నారని, గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాల నివారణతో పాటు, ఆపద సమయంలో 100 కాల్ చేసి సమస్యను వారి దృష్టికి తీసుకువెళ్లాలని వారు సూచించారు.



మద్దికెరలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ పులిశేఖర్

ఇళ్లలో చేరండి.. సౌకర్యాలు కల్పిస్తాం

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణ శివారులోని టిడ్కో నివాస ప్రాంతాల్లో ఎమ్మెల్యే పార్థసారథి, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, పురపాలక ఛైర్‌పర్సన్ శాంత తదితరులు మంగళవారం పర్యటించారు. ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడారు. అన్ని వసతులు కల్పిస్తామని, ఇళ్లలో చేరాలని కోరారు. కమిషనర్ కృష్ణ, సహాయ కమిషనర్ డా. అనుపమ, తహసీల్దార్ శివరాముడు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

పిల్లలు కలగలేదని వివాహిత ఆత్మహత్య

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వివాహం జరిగి రెండేళ్లు గడిచినా.. పిల్లలు కావడం లేదని మనస్తాపం చెందిన మహేశ్వరి(24) మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కడప నగరంలోని రవీంద్రనగర్‌కు చెందిన పద్మావతి కుమార్తె మహేశ్వరికి, వెల్దుర్తి మండలం, కొసనాపల్లి గ్రామానికి చెందిన మధు గౌడ్‌తో రెండేళ్ల కిందట వివాహం చేశారు. వీరికి పిల్లలు కాలేదు. మనస్తాపం చెందిన ఆమె కొసనాపల్లిలోని ఇంట్లో విష రసాయనం తాగారు. చికిత్స నిమిత్తం వెల్దుర్తి సీహెచ్‌సీకి తరలిస్తుండగా.. మార్గమధ్యలో ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలి తల్లి పద్మావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ పేర్కొన్నారు.



మహేశ్వరి (పాతచిత్రం)

గూడ్సు రైలు ఢీకొని రైతు దుర్మరణం

తుగ్గలి, న్యూస్‌టుడే: గూడ్సు రైలు ఢీకొని రాంపల్లి గ్రామ రైతు గుజ్జుల సుంకన్న(65) మంగళవారం మరణించినట్లు డోన్ రైల్వే పోలీసులు తెలిపారు. గ్రామ సమీపంలో రైల్వే ట్రాక్ పక్కన ఎద్దులు పచ్చి గడ్డి మేపుతున్న రైతుకు గూడ్సు రైలు పెట్టె తగిలి తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మరణించారన్నారు. రైతు భార్య గతంలోనే మరణించిండంతో కుమారులు వద్ద ఉంటున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రైల్వే పోలీసులు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ మృతి

వెల్దుర్తి, న్యూస్‌టుడే: 44వ జాతీయ రహదారిలోని మదార్‌పురం సమీపంలో ఈ నెల 18న జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగలింగం(60) గాయపడ్డారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందారు. డోన్ పట్టణం తారకరామనగర్‌కు చెందిన ఆయన కుటుంబ సభ్యులతో కలిసి కారులో వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యారు. మృతుడి కుమారుడు చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పట్నవాసం.. అవస్థలతో సతమతం

☛ వెంటాడుతున్న సమస్యలు ☛ కొత్త కమిషనర్‌కు పురవాసుల నివేదన

ఆదోని పురపాలక సంఘం	
వార్డులు:	42
జనాభా:	2 లక్షలు
విస్తీర్ణం:	37 చ.కి.మీ.
రహదారులు:	180 కి.మీ.
మురుగు కాలువలు:	215 కి.మీ.

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలో ఏళ్ల తరబడి జనం వివిధ సమస్యలతో సతమతం అవుతున్నారు. తాగునీరు మొదలు ట్రాఫిక్ సమస్యల వరకు అన్నింటా ఇబ్బందులు. చిన్న చినుకు పడితే చాలు ముంపు బాధలు తప్పడం లేదు. శివారులో తాగునీటి ఇక్కట్లు అధికంగా ఉన్నాయి. వీధి దీపాలు లేక చీకట్లో మగ్గుతున్నారు. కుక్కలు ప్రాణాలు తీస్తున్నాయి. మౌలిక వసతుల కల్పనపై దృష్టిసారించడం లేదని పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎం.కృష్ణ సమస్యల పరిష్కారంపై దృష్టిసారించాలని కోరుతున్నారు.



రాకపోకలకు కష్టాలు

పట్టణంలో ప్రధాన రహదారుల్లో రద్దీతో ఇబ్బందులు తప్పడం లేదు. పుర రహదారుల విస్తరణపై ప్రతిఎన్నికల్లో మాటలు చెబుతున్నా.. తీరా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. పది రహదారుల విస్తరణ తీర్మానం కాగితాలకే పరిమితమైంది. ఇతర ప్రాంతాల నుంచి 30-35 వేల మంది పట్టణానికి వస్తుంటారు. 40 వేల వాహనాలు తిరుగుతుంటాయి. ఇరుకు దారుల్లో, ఆక్రమణల కారణంగా ట్రాఫిక్ ఇబ్బందులతో జనం సతమతమవుతున్నారు. రహదారుల విస్తరణ చేపట్టి, సమస్య పరిష్కరించాలి.

తాగునీటికి ఇబ్బందులే

పట్టణంలో 40 వేల మంది ఆస్తిపన్ను చెల్లిస్తారు. 24 వేల కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. 42 వార్డుల్లో సగానికి పైగా తాగునీటి సమస్య వేధిస్తోంది. సీజన్‌తో పనిలేకుండా మూడు, నాలుగు రోజులకోసారి నీరు సరఫరా చేస్తుంటారు. బసాపురం నీటి కుంట మరమ్మతు పనులు అసంపూర్తిగా ఉన్నాయి. నీటి వనరులు ఉన్నా.. సద్వినియోగంలో పురపాలక సంఘం విఫలం అవుతోందనేది పట్టణ ప్రజల వాదన.

భయపెడుతున్న శునకాలు

పట్టణంలో కుక్కల బెడద అధికంగా ఉంది. నెలకు 300 మందికి పైగా కుక్క కాటుకు గురవుతున్నారు. నిధులు వెచ్చిస్తున్నా.. ఆశించిన ఫలితాలు మాత్రం రావడం లేదు. తాజాగా, పట్టివేత పనులు చేపట్టి, మధ్యలోనే ఆపేశారు. దీంతో జనం ఒంటరిగా తిరగలేని పరిస్థితి ఏర్పడింది. పింఛను కోసం వెళ్లిన ఓ వృద్ధురాలు కుక్కకాటుకు గురై మృతిచెందిన ఘటన పురవాసులను ఆందోళనకు గురిచేసింది.

మౌలిక వసతులు శూన్యం

పట్టణంలో కాలనీలు విస్తరిస్తున్నాయి. శివారు కాలనీలో కనీస వసతులు కరవయ్యాయి. కేవీఆర్, మైనార్టీ కాలనీ, న్యూ గాంధీ నగర్, ఇందిరానగర్, ఆర్టీసీ కాలనీ పొడగింపు కాలనీలు తదితర ప్రాంతాల్లో రహదారులు, మురుగు కాలువలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇక వీధి దీపాల బెడద తలపోటుగా మారింది. ఇప్పటికే పాత గుత్తేదారుడికి బకాయిలు చెల్లించకపోవడంతో దీపాల సరఫరా ఆపేశారు. గత ప్రభుత్వ హయాంలో నిర్వహణకు సైతం నిధులు కేటాయించకపోవడంతో వీధుల్లో చీకట్లు కమ్ముకున్నాయి.

చినుక పడితే.. మునకే

167వ జాతీయ రహదారి పట్టణం మీదుగానే వెళ్తోంది. పురపాలక రహదారిలో మోకాలి లోతు వర్షం నీటి ప్రవాహంతో రాకపోకలు స్తంభించి పోతున్నాయి. పీఎన్.రహదారి, తానాజీ, సట్టాబజారు, ఝాన్సీలక్ష్మీబాయి కూరగాయల మార్కెట్, గీతా మార్కెట్, కంచిగారివీధి, బీఎన్.టాకీస్ రహదారితో పాటు లోతట్టు ప్రాంతాలైన హవన్నపేట, కౌడల్‌పేట, ఆవుదూడ వంక, వడ్డే వీధి, ఎర్రవంక పరివాహక ప్రాంతాలు నిత్యం ముంపునకు గురవుతున్నాయి. కాలువలను విస్తరించడంతో పాటు వంకలను సంరక్షించాలి.



శ్రీమఠం హుండీ ఆదాయం రూ.2.94 కోట్లు


హుండీ లెక్కిస్తున్న భక్తులు

మంత్రాలయం, న్యూస్‌టుడే : మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామి హుండీ ఆదాయం రూ.2,94,57,810 లు సమకూరినట్లు మఠం మేనేజర్ వెంకటేశ్ జోషి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సురేశ్ కోణాపూర్ తెలిపారు. గత 28 రోజుల హుండీని మంగళవారం లెక్కించగా నగదుతో పాటు 750 గ్రాముల బంగారం, 1240 గ్రాముల వెండి భక్తులు సమర్పించినట్లు చెప్పారు. ఈ మొత్తాన్ని బ్యాంకులో జమ చేసినట్లు వివరించారు. లెక్కింపులో ధార్మిక అధికారి శ్రీపతి ఆచార్, సెక్యూరిటీ సూపర్‌వైజర్లు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు

• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

ఈవోకు వీడ్కోలు

మంత్రాలయం గ్రామీణం (కౌతాళం), న్యూస్‌టుడే : ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానంలో విధులు నిర్వహించి బదిలీలో భాగంగా అమరావతికి వెళ్తున్న డిప్యూటీ కమిషనరు, ఈవో హెచ్.జి.వెంకటేష్ కు మంగళవారం ఆలయ అధికారులు, తెదేపా నాయకులు వీడ్కోలు పలికారు. తెదేపా నాయకులు కొట్రేష్ గౌడు, కురుగోడు, సురేంద్ర పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఎమ్మిగనూరు (గ్రామీణం) : 80085 73794 కోడుమూరు : 80085 73776

పెద్దకడబూరు : **సమస్య :** మండలంలోని కంబదహాళు గ్రామంలో చాలా రోజుల నుంచి మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదు. దీంతో దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమల బెడద అధికమైంది. - గ్రామస్థులు

సమాధానం : పంచాయతీలో నిధులను అనుసరించి పారిశుద్ధ్య నిర్మూలన చర్యలు చేపడతాం.

- జనార్దన్, ఇన్‌ఛార్జి ఎంపీడీవో, పెద్దకడబూరు.

వైభవంగా దశమి వేడుకలు


స్వామి అగ్నిని దర్శించుకుంటున్న భక్తులు

గోనెగండ్ల, న్యూస్‌టుడే : గోనెగండ్లలో వెలసిన చింతలమునినిస్వామి, నల్లారెడ్డిస్వాముల దశమి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. మూడో రోజు మంగళవారం స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి అగ్నిని దర్శించుకుని పలహారాలు తింటే కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. కావున పలహారాలు తినిపించేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ట్రాక్టర్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు ముగిశాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ గంగాధర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేశారు.

27న ఉద్యోగమేళా

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : ఎమ్మిగనూరు మహాయోగినిలమ్మమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 27 ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు ప్రధానాచార్యుడు మహబూబ్‌బాషా తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. వికాస్ అరవింద్, ఫార్మాసీ, నవత రోడ్డు ట్రాన్స్‌పోర్ట్‌తో పాటు, ఇతర కంపెనీలు వస్తున్నాయన్నారు. నిరుద్యోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వేరుశనగ క్వింటా గరిష్ఠ ధర రూ.7,319

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే : వ్యవసాయ మార్కెట్లో మంగళవారం వేరుశనగ క్వింటా గరిష్ఠ ధర రూ.7,319, మధ్యస్థ ధర రూ.6,269, కనిష్ఠ ధర రూ.2,499పలికింది. మార్కెట్‌కు 4,757 వేరుశనగ బస్తాలను తెచ్చారు. ఆముదాలుగరిష్ఠ, మధ్యస్థ ధర రూ.5,770, కనిష్ఠ ధర రూ.5,390 పలికింది.

శునకం.. భయానకం

నగర పంచాయతీలో కొరవడిన నియంత్రణ


గూడూరు వీధిలో గుంపులుగా కుక్కలు



గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే : పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వీధి కుక్కల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండటంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఒంటరిగా తిరగాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. చిన్న పిల్లలైతే వణికిపోతున్నారు. గూడూరు నగర పంచాయతీలో గతంలో కుక్కలను పట్టుకుని వాటి వ్యాప్తిని తగ్గించేవారు. గడచిన ఐదేళ్లుగా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో పట్టపగలు దారుల వెంట వస్తున్న వృద్ధులపై, ద్విచక్ర వాహనాలపై వెళ్తున్నవారిపై దాడులు చేస్తున్నాయి.

గూడూరు నగర పంచాయతీలో 20 వార్డుల్లో సుమారు 700-800, తొమ్మిది గ్రామ పంచాయతీల్లో 5 వేల వరకు వీధి కుక్కలు ఉన్నట్లు అంచనా. ఏటా వాటికి సంతాన నిరోధక శస్త్రచికిత్సలు నిర్వహించకపోవడంతో సంఖ్య పెరుగుతోంది. కనీసం వాటికి టీకాలు వేసిన దాఖలాలు లేవు. వృద్ధులు, కుక్కల మాంసం తిని కుక్కలు ప్రవర్తనలో మార్పు వచ్చి మనుషులు, పశువులు, గొర్రెలపై దాడులు చేస్తున్నాయి. గుంపులుగా దారుల వెంట తిరడగం, దారులపైనే నిద్రిస్తున్నాయి. తినుబండారాలు పట్టుకున్న పిల్లలపై దాడి చేసిన ఘటనలు అనేకమున్నాయి. గడిచిన ఐదు నెలల్లో గూడూరు ప్రభుత్వ ఆసుపత్రిలో 202 మంది రేబిస్ నివారణ టీకాలు వేయించుకోవడమే ఇందుకు నిదర్శనం. ఇంకా కర్నూలులో సర్వజన ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి టీకాలు వేయించుకున్న వారితో ఈ లెక్క పెరుగుతోంది.

గడప దాటాలంటే భయం

- నజీర్, గూడూరు

పగలు, రాత్రి తేడా లేకుండా కుక్కలు దారులపై గుంపులుగా తిరుగుతున్నాయి. బయటకు రావాలంటే దడ పుడుతోంది. పొరపాటున కుక్కల పక్కకు తొలితే వెంట పడుతాయి. అధికారులు కార్లలో తిరుగుతారు, వారికేం తెలుస్తుంది మా బాధ. కరిస్తే తెలుస్తుంది. రాత్రిపూట అరుపులకు నిద్ర పట్టదు. అధికారులు ఇప్పటికైనా వాటిని నియంత్రించాలి.

టీకాల కొరత లేదు

- నర్సియా, వైద్యురాలు

గూడూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రేబిస్ టీకాలకు కొరత లేదు. కుక్క, కోతి, పిల్లి, ఎలుక కాటుకు గురైనవారు వస్తే పరీక్షించి డోసుల వారీగా టీకాలు వేస్తాం. నాటు వైద్యం తీసుకోవడం, నిర్లక్ష్యం చేయడం మంచిది కాదు. రేబిస్ వ్యాధి ప్రాణాంతకం కాబట్టి, తప్పని సరిగా టీకాలు వేయించుకోవాలి.

ఆదర్శంగా తీర్చిదిద్దుదాం


ర్యాలీ నిర్వహిస్తున్న పురపాలక సంఘం అధికారులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా ఎమ్మిగనూరు పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దామని డీఈ నీరజా పిలుపునిచ్చారు. ఎమ్మిగనూరులో మంగళవారం నిర్వహించిన స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తకోట (సి.బెళగల్) : కొత్తకోట గ్రామంలో గ్రామపంచాయతీ కార్యదర్శి షపుల్లా బేగు ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో నిర్వహించారు.

ఛార్జీలు ప్రభుత్వమే భరించాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : అంగన్‌వాడీ కేంద్రల్లోని విద్యుత్తు, నిత్యావసర సరకుల ఛార్జీలను ప్రభుత్వం భరించాలని సీఐటీయూ నాయకురాలు గోవర్ధనమ్మ డిమాండు చేశారు. ఈ మేరకు మంగళవారం ఆమె నాయకులతో కలిసి ఎమ్మిగనూరు సీఐటీయూ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం సమస్యలపై సీడీపీవోకు వినతిపత్రం అందజేశారు.

అన్నదాతలకు మేలు చేస్తుంది


ముగతిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధికారులు

ముగతి(నందవరం), న్యూస్‌టుడే : పొలం పిలుస్తోంది అనే కార్యక్రమం అన్నదాతలకు ఎంతో మేలు చేస్తుందని జేడీఏ కృపదాస్, జిల్లా వ్యవసాయాధికారిణి వరలక్ష్మి తెలిపారు. మండలంలోని ముగతి గ్రామంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వారు మాట్లాడారు. రైతులు ఆధునిక సేద్యాన్ని అందిపుచ్చుకోలేక పోవడం, భూసారం గుర్తించలేకపోవడంతో దిగుబడులు తగ్గడం, పెట్టుబడులు పెరగడం వంటికి జరుగుతున్నాయన్నారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, కృషి విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ రాఘవేంద్ర, సహాయ వ్యవసాయ సంచాలకుడు మహమ్మద్ ఖాద్రి, మండల వ్యవసాయాధికారిణి స్రవంతి, ఏఈవో సురేంద్ర గౌడ్, సహాయకురాలు నజ్రీన్ తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే : రైతులు పంటల సాగులో వ్యవసాయ సిబ్బంది సలహాలు తప్పక తీసుకోవాలని జేడీఏ కృపదాస్ పేర్కొన్నారు. కోడుమూరు వ్యవసాయ కార్యాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు.

గోనెగండ్ల, న్యూస్‌టుడే : రైతులు ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని మండల వ్యవసాయాధికారిణి హేమలత తెలిపారు. మండలంలోని అలువాల, పెద్దనెలటూరు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే : పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక లాభాలు వస్తాయని మండల వ్యవసాయాధికారి రవిప్రకాశ్ తెలిపారు. కోడుమూరులో మంగళవారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

సి.బెళగల్, న్యూస్‌టుడే : పంటల్లో అధిక దిగుబడులు సాధించడంలో రైతులకు అవగాహన కల్పించడమే పొలం పిలుస్తుంది కార్యక్రమం లక్ష్యమని ఏవో మల్లేశ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని చింతమానుపల్లె గ్రామంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆయన రైతులకు అవగాహన కల్పించారు.

కలగానే సంపద సృష్టి



తెదేపా హయాంలో సి.బెళగల్‌లో చెత్త సంపద కేంద్రం నిర్మాణాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత వదిలేయడంతో సేవలకు దూరంగా ఉంది. దీంతో చెత్త సంపద కేంద్రం చుట్టూ చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. బురాన్‌దొడ్డి మార్గంలో రహదారికి సమీపంలో ఉండటంతో గాలికి చెత్త లేసి వాహనదారుల కళ్లలో పడుతోందని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం అక్టోబరు 2 లోపు కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించింది. అయినా ఈ కేంద్రంలో మరమ్మతు పనులు చేపట్టకపోవడం గమనార్హం. **– న్యూస్‌టుడే, సి.బెళగల్**

నిధులు ఆవిరి... నిలిచిన పనులు



జల్‌జీవన్ పథకంలో భాగంగా ఇంటింటికి కుళాయి మంజూరుకు వైకాపా హయాంలో పనులు చేపట్టారు. ప్రతి గ్రామానికి రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు కేటాయించారు. మండలంలోని బనవాసిలో తాగునీటి పైపులైన్ వేసేందుకు ప్రధాన రహదారిలో సీసీ దారిని తవ్వారు. లోపల పైపులైన్ వేసి రెండింటిని వదిలేశారు. వీటితో శుద్ధజలం లేకపోవడంతో గ్రామస్థులు బోరు నీటిని తాగుతున్నారు. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి పైపులైన్ పనులు పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. **– న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు**

వందరోజుల్లోనే ప్రజలకు భరోసా


కార్యక్రమంలో పాల్గొన్న తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబస్సప్ప, సీనియర్ నాయకులు

మంత్రాలయం గ్రామీణం (కౌతాళం), న్యూస్‌టుడే : అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే భవిష్యత్ పట్ల ప్రజలకు భరోసా ఇచ్చిందని తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబస్సప్ప, సీనియర్ నాయకుడు బాపురం శివమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. కౌతాళంలో మంగళవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దారు మల్లికార్జున స్వామి, ఎంపీడీవో సుబ్బరాజు, భాజపా నాయకుడు రామకృష్ణ, తెదేపా నాయకులు కొట్రేష్‌గౌడు, కురుగోడు, రమేష్‌గౌడు, కాశీవిశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సూగూరు (మంత్రాలయం), న్యూస్‌టుడే : మండలంలోని సూగూరు గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం తెదేపా నాయకులు భాస్కర్‌రెడ్డి, గోపాల్, సచివాలయ సిబ్బంది ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు.

కరపత్రాల పంపిణీ

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే : కోడుమూరులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో చంద్రశేఖర్, సిబ్బంది, తెదేపా నాయకులు ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు.

సభ్యత్వ నమోదు

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే : కోడుమూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు మునిస్వామి, వీరేంద్ర, వీరంజినేయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలను అరెస్టు చేయాలి

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : అంబేడ్కర్ ఫ్లెక్సీని చించిన ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ప్రజా సంఘాలు, వివిధ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వారు ఎమ్మిగనూరు పట్టణ సీఐ సుదర్శన్‌రెడ్డికి ఫిర్యాదు పత్రం అందజేశారు.

గోనెగండ్ల, న్యూస్‌టుడే : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని చింపిన, దళిత డాక్టరుపై దాడి చేసిన ఎమ్మెల్యేలు రఘురామ కృష్ణంరాజు, పంతం నానాజీలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మహదేవ మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన నాయకులతో కలిసి గోనెగండ్ల తహసీల్దారు కార్యాలయం ఎదుట కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో అక్రమ వసూళ్లు


స్టాఫ్‌నర్స్ రాఘవేంద్ర (కుడివైపు నుంచి మొదటి వ్యక్తి)ను నిలదీస్తున్న బాధితులు

కోసిగి, న్యూస్‌టుడే : ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత వైద్యమని వస్తే ప్రసవం, మందులు తదితర కోసమని డబ్బులు వసూలు చేస్తున్నారని బాధితులు గగ్గోలు పెట్టుకుంటున్నారు. కోసిగి ప్రభుత్వ ఆసుపత్రికి తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి మంగళవారం ఇతర పనులపై వెళ్లారు. ఆయనకు ప్రసవం జరిగిన మహిళ కుటుంబ సభ్యులు జరుగుతున్న దోపిడీ గురించి వైద్య సిబ్బంది ముందే చెప్పారు. స్టాఫ్‌నర్స్ రాఘవేంద్ర డబ్బులు ఇస్తేనే ప్రసవం చేస్తున్నాడని, ప్రసవ సమయంలో గర్భిణులను అవమానకరంగా మాట్లాడుతున్నాడన్నారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రికి ఎదురుగా ఉన్న ప్రైవేటు మెడికల్ దుకాణం వ్యక్తితో బినామీగా ఉంటూ ప్రసవంకు వచ్చిన వాళ్లను అక్కడికే మందులకు పంపించి వేలకు వేలు లాక్కుంటున్నారని బాధితులు ముత్తురెడ్డికి స్టాఫ్‌నర్స్ ముందే వివరించారు. ఆయాలను మధ్యవర్తిగా పెట్టుకొని ప్రసవానికి వచ్చిన వాళ్ల నుంచి రూ. 2 వేల నుంచి రూ.4 వేల వరకు ఇప్పించుకుంటున్నావని సిబ్బందిపై ముత్తురెడ్డి మండిపడ్డారు. ఐదురోజుల కిందట ఆసుపత్రికి కందుకూరు గ్రామానికి చెందిన హరిజన తిమ్మప్ప తన కుమార్తెను ప్రసవం కోసం తీసుకువస్తే రూ.1500 ఆశావర్కర్ ద్వారా ఇప్పించుకున్నాడని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ వారు కూడా ఆసుపత్రి నుంచి ఇంటికి తీసుకెళ్తే రూ.400 వసూలు చేస్తుండటంతో తెదేపా నాయకులు, బాధితుల కుటుంబ సభ్యులు వైద్య సిబ్బందిపై ఆందోళనకు దిగారు. వీరిపై జిల్లా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రౌడీ షీట్ తెరుస్తాం

కోసిగి, న్యూస్‌టుడే : మళ్లీ ఇలాంటి ఘర్షణలకు పాల్పడితే రౌడీ షీట్ ఓపెన్ చేస్తామని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్ర బాబు నిందితులను హెచ్చరించారు. కోసిగి మండలం కందుకూరు గ్రామంలో ఈ నెల 23న కందుకూరుకు చెందిన భీమేశ్‌తో పాటు 6 మంది, కౌతాళం మండలం తిప్పలదొడ్డి గ్రామానికి చెందిన మల్లయ్యతో పాటు 8 మంది అక్రమ మద్యం తరలించే విషయమై కారం, కర్రలతో ఘర్షణ పడిన సంగతి తెలిసిందే. వీరిని మంగళవారం కోసిగి ఎస్సై చంద్రమోహన్ ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు డీఎస్పీ కార్యాలయాలనికి తరలించారు. డీఎస్పీ వీరికి కౌన్సిలింగ్ ఇచ్చి ఇరు వర్గాల వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు.

హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై హర్షం


క్షీరాభిషేకం చేస్తున్న న్యాయవాదులు

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే : కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పటం పట్ల న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కోడుమూరు కోట్ల కూడలిలో మంగళవారం వారు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. న్యాయవాదులు శ్రీనివాసులు, రమేశ్ మాట్లాడుతూ.. జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.10 వేలు స్టైఫండ్ అందిస్తామనడం ఆనందంగా ఉందన్నారు. తెదేపా లీగల్ సెల్ అధ్యక్షుడు మదేశ్, సంయుక్త కార్యదర్శి మద్దిలేటి, న్యాయవాది విజయ్‌కుమార్, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయి క్రీడలు ప్రారంభం

కోసిగి, న్యూస్‌టుడే : క్రీడలకు, చదువుకు కీలకమైన సమయాన్ని ఇస్తూ విద్యార్థినులు ఉన్నత స్థాయిలకు ఎదగాలని మండల విద్యాధికారి శోభారాణి, ప్రధానోపాధ్యాయుడు ఖలీల్ అహ్మద్ పేర్కొన్నారు. కోసిగి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ క్రీడా పోటీలను మండల విద్యాధికారి ప్రారంభించారు. అనంతరం మండలంలో వివిధ జడ్పీ పాఠశాలల నుంచి వచ్చిన క్రీడాకారిణిలకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, యోగా, చెస్, షటిల్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కోఆర్డినేటర్ నరసింహులు, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


క్రీడలకు హాజరైన విద్యార్థినులు, వ్యాయామ ఉపాధ్యాయులు

పర్యవేక్షకురాలిపై చర్యలకు సిద్ధం?

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకురాలు మైత్రేయిపై పలు ఆరోపణలు రావడంతో ఆమెపై చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులు సిద్ధమైనట్లు తెలిసింది. ఆసుపత్రిలో గతంలో నవజాత శిశువు మృతి చెందడానికి కారణం పర్యవేక్షకురాలి నిర్లక్ష్యమే కారణమని బాధిత కుటుంబసభ్యులు రాష్ట్రస్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ నెల 25న డీసీహెచ్ఎస్ మాధవి మైత్రేయిని విచారణ చేసేందుకు ఎమ్మిగనూరు ఆసుపత్రికి వస్తున్నట్లు వైద్యులు తెలిపారు.

ఒకటో తేదీన వేతనాలు అందించాలి


ధర్నా చేస్తున్న ఉద్యోగులు

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే : సమగ్ర శిక్షలో పని చేసే ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులకు ఒకటో తేదీన వేతనాలు ఇవ్వాలని రాష్ట్ర జేఏసీ కో ఛైర్మన్ మహమ్మద్ రఫీ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఉద్యోగులు, నాయకులతో కలిసి కోడుమూరు ఎంఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. కో ఛైర్మన్ మాట్లాడుతూ.. ఆగస్టు, సెప్టెంబరుకు సంబంధించిన వేతనాలు, వార్షిక బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, హెచ్ఆర్ పాలసీ, ఎంటీఎస్ తదితర సమస్యలు పరిష్కరించాలన్నారు. జేఏసీ నాయకులు సుధాకర్, ఏకాంత్, సోమేశ్వరీ, సుబ్బరాయుడు, సునీత, భాస్కర్ పాల్గొన్నారు.

వైకాపాను వీడి తెదేపాలో చేరికలు


ఎంపీకి విరాళం అందజేస్తున్న ఆలంబాషా, తదితరులు

మాధవరం (మంత్రాలయం), న్యూస్‌టుడే : మంత్రాలయం నియోజకవర్గం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ప్రధాన అనుచరుడు ముస్లిం మైనారిటీ నాయకుడు ఆలంబాషా, మరో ముఖ్య నాయకుల వంద కుటుంబాలు వైకాపాను వీడి తెదేపాలో చేరాయి. వీరికి మండలంలోని మాధవరంలో మంత్రాలయం నియోజకవర్గ తెదేపా నాయకుడు రాఘవేంద్ర రెడ్డి స్వగృహంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు, రాఘవేంద్రరెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆలంబాషా మాట్లాడుతూ.. సొంత గూటికి చేరుకున్నందుకు ఆనందంగా ఉందని, చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని చెప్పారు.

వరద బాధితులకు రూ.50 వేల విరాళం

అనంతరం విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ. 50 వేల రూపాయలను ఎంపీ, రాఘవేంద్రరెడ్డికి అందించారు. తర్వాత ఎంపీ, రాఘవేంద్రరెడ్డి పొలం పిలుస్తుంది కార్యక్రమానికి సంబంధించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి రఘునాథ్‌రెడ్డి, యువ నాయకుడు రామకృష్ణారెడ్డి, మైనారిటీ నాయకులు కేజీటీ గౌస్, ఖాజా, రఫిక్, మహ్మద్, అనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు న్యాయం


భూమి పూజలో ఎమ్మెల్యే బీవీ

నందవరం, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతోందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. నందవరంలో మంగళవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్యే బీసీ కాలనీ, ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు, జల్‌జీవన్ మిషన్ పథకానికి భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్ కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. గతంలో తాము ఆర్డీఎస్ ప్రాజెక్టుకు రెండు వేల కోట్లు మంజూరు చేయిస్తే రివర్స్ టెండర్ పేరిట వైకాపా ప్రభుత్వం నాశనం చేసిందన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

పోలకల్(సి.బెళగల్), న్యూస్‌టుడే : ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కోడుమూరు ఎమ్మెల్యే బి.దస్తగిరి పేర్కొన్నారు. మండలంలోని పోలకల్ గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికి ఇచ్చి హామీలను అమలు చేస్తుందన్నారు. అంతకు ముందు ఆయన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

దారులు అధ్వానం.. ప్రజలకు నరకం


వెంకటగిరి దగ్గర గుంతలమయమైన రహదారి

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే : కోడుమూరు నుంచి వెల్దుర్తి వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. ఈ దారి వెంట నిత్యం 11 గ్రామాల ప్రజలు ప్రయాణిస్తుంటారు. అలాగే వెల్దుర్తి వద్దనున్న జాతీయ రహదారి నుంచి కోడుమూరు మీదుగా ఈ రోడ్డులోనే కర్ణాటక, ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. ఇంత ప్రధానమైన రోడ్డు గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యంతో అధ్వానంగా ఉంది. ఈ రహదారిలో రాకపోకల సమయంలో ప్రమాదాల బారిన పడి ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు చాలా ఉన్నాయి. దీంతో ఈ రోడ్డులో రాకపోకలు సాగించేందుకు ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి రహదారి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.


మట్టి రోడ్డును తలపిస్తున్న కోడుమూరు- వెల్దుర్తి రహదారి

బిల్లులు రావనే భయమే?

గత వైకాపా ప్రభుత్వంలో మూడేళ్ల కిందట కోడుమూరు నుంచి వెల్దుర్తికి వెళ్లే రహదారిలోని 3.0 కి.మీ. నుంచి 14.5 కి.మీ. రాయి వరకు రెండు వరుసల రహదారి నిర్మించేందుకు ఎన్‌డీబీ కింద రూ.20 కోట్లు మంజూరు చేశారు. పనులను గుత్తేదారుకు కూడా అప్పగించారు. కానీ ఇంత వరకు పనులు మొదలు పెట్టలేదు. గుత్తేదారు కనీసం అటు వైపు కూడా తొంగిచూడలేదు. బిల్లులు రావనే భయంతోనే గుత్తేదారు పనులు మొదలు పెట్టలేదనే విమర్శలున్నాయి. మళ్లీ టెండర్లు వేసి రోడ్డు నిర్మించమని తీర్మానాలు చేసిన స్పందించలేదు. అధికారుల ఒత్తిడి చేసిన ఏ మాత్రం ప్రయోజనం లేకుండా పోయింది. కొత్త టెండర్లు సైతం పిలవకుండా కాలయాపన చేశారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

ఈ గ్రామాలకు వెళ్లేదెలా

ఈ రహదారిపై కోడుమూరుకు వెంకటగిరి, గోరంట్ల, కొత్తపల్లి, కొండాపురం, లద్దగిరి, రామాపురం, అనుగొండ, ఎర్రదొడ్డి, చిల్లబండ, అమడగుంట్ల, అల్లినగరం తదితర గ్రామస్థులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ప్రయాణం చేయాలంటే నరకంగా ఉందని ఆయా గ్రామస్థులు చెబుతున్నారు.

దుమ్ము విపరీతంగా పెరిగింది

– రామాంజనేయులు



ఈ రహదారి వెంట భారీ వాహనాలు తిరుగుతుండటంతో దుమ్ము విపరీతంగా పెరిగింది. ఇళ్లలో ఉండలేకపోతున్నాం. చిన్నపాటి వర్షం కురిసిన రహదారి గుంతల్లో నీళ్లు నిలిచి ప్రమాదాల బారిన పడుతున్నాం. గోరంట్ల శ్రీమాధవస్వామి క్షేత్రం, ఎర్రగుడికి వెళ్లాలన్న, కోడుమూరుకు వెళ్లాలన్న ఇబ్బందులు పడుతున్నాం.

కర్నూలు

• కర్నూలు • పాణ్యం

జగన్‌పై చర్యలు తీసుకోవాలి


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: నెయ్యి కల్తీ విషయంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌పై చర్యలు తీసుకోవాలని తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు కోరారు. తెలుగు యువత ఆధ్వర్యంలో యస్. అబ్బాస్, సోమిశెట్టి నవీన్, పీజీ.గోపీనాథ్, నగర తెదేపా అధ్యక్షుడు నాగరాజు యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం జగన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్పొరేటర్ పరమేశ్, రమణమ్మ, డి.జేమ్స్, రామకృష్ణుడు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: సంతోష్‌నగర్ సబ్‌స్టేషన్ పక్కనే ఉన్న రైతుబజార్‌లో విద్యుత్తు తీగ తెగిపోవడంతో గంట పాటు విద్యుత్తు సరఫరాకు అంతరాయం తలెత్తింది. దీంతో బాలాజీ నగర్, రామలింగేశ్వర్‌నగర్, సంతోష్‌నగర్, వెంకటరమణ కాలనీల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. డీ1 సెక్షన్ ఏఈఈ నాగప్రసాద్‌ను వివరణ కోరగా.. విద్యుత్తు తీగ తెగిపోవడంతో అంతరాయం ఏర్పడటంతో పనులు పూర్తి చేసినట్లు చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
కర్నూలు : 80085 52632
కర్నూలు గ్రామీణం : 85010 05408
ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలకసంస్థ, సమస్య: కృష్ణానగర్ ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నాం. - ప్రవీణ్, స్థానికుడు

సమస్య: ముజఫర్‌నగర్‌లోని వీధుల్లో మురుగు కాలువలను శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. - నాగరాజు, స్థానికుడు

సమాధానం: సమస్యలను పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. - నగరపాలక అధికారులు


శిక్షణకు హాజరైన వైద్యులు

ప్రాథమిక వైద్య విద్య కోర్సు తప్పనిసరి

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే: వైద్య విద్య బోధకులకు ప్రాథమిక వైద్యవిద్య కోర్సు తప్పనిసరి అని కళాశాల ప్రిన్సిపల్ డా.చిట్టినరసమ్మ తెలిపారు. కళాశాలలోని మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్‌లో సమన్వయకర్త శుభప్రద అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బోధకులు తమ నైపుణ్యాలను పెంపొందించుకున్నప్పుడే సమర్థవంతంగా రాణించగలుగుతారన్నారు. ఎన్ఎంసీ నోడల్ సెంటర్ అబ్జర్వర్ భాస్కర్, శాంతారామ్ వైద్యకళాశాల ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ డా.పశుపతి హాజరయ్యారు.

తాఖీదుల జారీ

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: కర్నూలు అర్బన్ ఎంఈవో-1 ప్రభావతమ్మకు డీఈవో శామ్యూల్ పాల్ షోకాజు నోటీసు ఇచ్చారు. పాతబస్తీలోని కింగ్‌మార్కెట్ వద్ద ఉన్న నగరపాలక ప్రాథమిక పాఠశాలలో ఉన్న ఒక్క ఉపాధ్యాయిని సెలవుపై వెళ్లడంతో 'నిరీక్షణే మిగిలింది' శీర్షికన ఈనాడులో మంగళవారం చిత్ర వార్త ప్రచురితమైంది. తాత్కాలిక ఉపాధ్యాయుడిని నియమించడంలో ఎంఈవో-1 విఫలమైనట్లు తేలడంతో నోటీసు ఇచ్చినట్లు అందులో పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్లు.. సమస్యలకు నిలయాలు


కర్నూలు బస్టాండులో అధ్వానంగా మరుగుదొడ్లు

ఆర్టీసీ బస్టాండ్లలో నెలకొన్న సమస్యలతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో మేమున్నాం- మీకు తోడుగా శీర్షికన ఈనాడులో మంగళవారం ఇచ్చిన పిలుపు మేరకు ప్రయాణికులు తమ సమస్యలను చరవాణి ద్వారా తెలియజేశారు. ఆ సమస్యలను కర్నూలు-1 డిపో మేనేజర్ కె. సుధారాణి దృష్టికి తీసుకెళ్లగా సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ బస్టాండ్లలో ప్రయాణికుల సమస్యలపై కథనం. – కర్నూలు బి. క్యాంపు, ఓర్వకల్లు, న్యూస్‌టుడే:

సౌకర్యాలు లేక అవస్థలు

సమస్య: ఓర్వకల్లు బస్టాండులో మరుగుదొడ్డితో పాటు ఇతర సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు, ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి. **- షాదిక్ బాషా, ఓర్వకల్లు**

సమాధానం: బస్టాండులో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తాం. **- ఆర్టీసీ అధికారులు**

సమస్య: కర్నూలు నుంచి బేతంచర్లకు వచ్చే బస్సులు సకాలంలో రాకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. **- రాము, ప్రభు, లక్ష్మి, ఉద్యోగులు, కర్నూలు**

సమాధానం: ప్రయాణికుల సౌకర్యార్థం బస్సులు వెనువెంటనే రాకుండా సమయానికి వచ్చే విధంగా చర్యలు తీసుకుంటాం. విద్యార్థులకు అనుగుణంగా బస్సు సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తాం. **- డిపో మేనేజర్**

సమస్య: ఓర్వకల్లు మండలంలోని కన్నమడకల గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే బస్సు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలి. **- రమేశ్, గ్రామస్థుడు**

సమాధానం: బస్సు సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం. **- ఆర్టీసీ అధికారి**

పరిసరాలన్నీ అపరిశుభ్రం

సమస్య: ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలన్నీ అపరిశుభ్రంగా మారి దుర్వాసన వెదజల్లుతుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. **- వెంకట్, ప్రభు**

సమస్య: కర్నూలు బస్టాండులోని తెలంగాణ ప్లాట్‌ఫామ్‌పై ఎల్లప్పుడూ అపరిశుభ్రంగా ఉంటుంది. అక్కడ మురుగు కాలువలు నిండిపోయి మురుగు బయటకు వస్తోంది. **- వాణి, విజయ, ప్రయాణికులు**

సమాధానం: బస్టాండ్లలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. బస్టాండ్‌ను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రయాణికులు సైతం సహకరించాలి. మురుగు కాలువలకు మరమ్మతులు చేపట్టాం. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. **- డిపో మేనేజర్**

అధిక ధరలకు వస్తువుల అమ్మకం

సమస్య: బస్టాండ్‌లో ఉన్న దుకాణదారులు వస్తువులను ఎమ్మార్పీ ధరలకు కాకుండా అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఇదేంటని అడిగితే యజమానులు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. **- రమ్య, శ్రీదేవి, ప్రయాణికులు**

సమాధానం: అధిక ధరలకు వస్తువులు విక్రయించే దుకాణదారులపై జరిమానాలు విధిస్తున్నాం. అధిక ధరల విషయంలో ప్రయాణికులు బస్‌స్టేషన్ మేనేజర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడం ద్వారా నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం. **- డిపో మేనేజర్**

బస్సుల వేగంతో భయాందోళన

సమస్య: ఎమ్మిగనూరు నుంచి కర్నూలు వచ్చే రాత్రి బస్సుల్లో ఆర్టీసీ డ్రైవర్లు పోటీ పడి వేగంగా బస్సులు నడుపుతుండటంతో ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. దీంతో ప్రయాణికులకు, ఆర్టీసీకి ఇబ్బందులు తప్పవు. **- రాణి, విజయ, లక్ష్మి, ఎమ్మిగనూరు పట్టణవాసులు**

సమాధానం: ప్రయాణికులను ఎక్కించుకోవడంలో పోటీ పడాలని డ్రైవర్లకు సలహా ఇవ్వడం జరిగింది. బస్సులను వేగంగా నడపడం ద్వారా ఇబ్బందులు తప్పవు. బస్సుల వేగ నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. **- డిపో మేనేజర్**

సమయపాలన పాటించని బస్సులు

సమస్య: కర్నూలు నుంచి ఎమ్మిగనూరు, ఎమ్మిగనూరు నుంచి కర్నూలు మార్గాల్లో బస్సులు సమయానికి రావడం లేదు. బస్సులు ఒకదాని వెంట ఒకటి రావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. **- హిటేశ్వరరెడ్డి, రుద్ర, వినయ్, సి.బెళగల్ గ్రామస్థులు**

సమస్య: గడివేముల నుంచి కర్నూలు వచ్చే బస్సుల్లో అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రయాణిస్తున్నారు. బస్సులు సకాలంలో రాకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. విద్యార్థులకు మరో బస్సును ఏర్పాటు చేయాలి. **- రాజు, విజయ, రవి, పరమేశ్, గడివేముల విద్యార్థులు**


గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా తదితరులు

గుండె వ్యాధులపై అవగాహన ముఖ్యం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: గుండె వ్యాధులపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకుని ఆరోగ్యకర జీవనం సాగించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోడపత్రాలు ఆవిష్కరించారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా 29వ తేదీన కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిపుణులైన వైద్యులు పలు అంశాలపై అవగాహన కల్పిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డా. చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు కల్కూర చంద్రశేఖర్, డా.భవాని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

140 మంది అభ్యర్థుల గైర్హాజరు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న బీఈడీ నాలుగో సెమిస్టర్ పరీక్షకు 3,231 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 3,091 మంది పరీక్ష రాసినట్లు కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినర్ వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 140 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చెప్పారు. ఎలాంటి మాల్‌ప్రాక్టీసు కేసులు నమోదు కాలేదన్నారు.

స్వచ్ఛ హంద్రీ.. సాకారమయ్యేనండి


వ్యర్థాలను ట్రాక్టర్లలో తరలిస్తూ..
పొక్లెయిన్‌తో ముళ్లపొదల తొలగింపు

కర్నూలు నగరం మీదుగా ప్రవహించే హంద్రీ నది అధ్వానంగా మారింది. ముళ్లపొదలు, మురుగుతో నిండిపోయింది. ఈ నేపథ్యంలో నగరపాలక సంస్థ, జలవనరుల శాఖ ఆధ్వర్యంలో పొక్లెయిన్లతో చెట్ల పొదలు తొలగిస్తున్నారు. స్వచ్ఛ హంద్రీలో భాగంగా నది ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఇటీవల హంద్రీ నది పరిరక్షణ కమిటీ, పలు ప్రజా సంఘాల ప్రతినిధులు పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఈ నేపథ్యంలో అధికారులు హంద్రీ నదిపై దృష్టి పెట్టారు. – ఈనాడు, కర్నూలు

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలని వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సీఆర్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ నాయకులు సోమన్న, షాపీర్‌బాషా అధ్యక్షతన మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉక్కు పరిశ్రమను ప్రైవేటుపరం చేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవాలని కోరారు. వివిధ సంఘాల నాయకులు శ్రీనివాసులు, బీసన్న, అబ్దుల్లా, నగేష్, అఖండ, మహేంద్ర, ఆది తదితరులు పాల్గొన్నారు.

సాధనతోనే విజయాలు సాధ్యం


బాస్కెట్‌బాల్ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో వ్యాయామ ఉపాధ్యాయులు

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే: ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు క్రీడాకారులు నిత్యం సాధన చేయాలని ఎస్‌జీఎఫ్ అండర్-19 కార్యదర్శి హర్షవర్ధన్ సూచించారు. స్థానిక బీ.క్యాంపు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో అండర్-19 హ్యాండ్‌బాల్, సిల్వర్ జూబ్లీ బాస్కెట్‌బాల్ ఏరినాల్లో జిల్లా స్థాయి ఎంపిక పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వ్యాయామ అధ్యాపకులు నరసప్ప, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో పాల్గొనాలి

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: చదువుతో పాటు సమాజ సేవలో పాల్గొనాలని ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ దినోత్సవం సందర్భంగా ఆర్‌యూలో మంగళవారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో మాట్లాడారు. అత్యవసర సమయంలో ఎంతోమంది ప్రాణాల రక్షణకు రక్తదానం చేయాలని సూచించారు. రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ నాగరాజు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ హరిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

అమ్మో.. ఆ సీట్లు మాకొద్దు


కర్నూలు, కల్లూరు సబ్ రిజిస్ట్రార్లుగా వచ్చేందుకు విముఖత

కర్నూలు గాయత్రీ ఎస్టేట్, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లా స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ పరిధిలో కర్నూలు, కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సబ్ రిజిస్ట్రార్ల నియామకాలపై ప్రతిష్టంభన నెలకొంది. ఉమ్మడి జిల్లాలో 19 మంది సబ్ రిజిస్ట్రార్లు, 28 సీనియర్ అసిస్టెంట్లను బదిలీ చేస్తూ ఆ శాఖ డీఐజీ కల్యాణి ఉత్తర్వులు జారీ చేశారు. వెలువడిన జాబితా మేరకు ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్లుగా వ్యవహరించి అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడిన సీనియర్ అసిస్టెంట్లను వారికి అనుకూలమైన ప్రాంతాలకు బదిలీ చేశారన్న ప్రచారం ఉంది

సీనియర్ అసిస్టెంట్లను నియమించినా..

అక్రమ రిజిస్ట్రేషన్, నకిలీ చలానాతో రిజిస్ట్రేషన్ చేశారన్న ఆరోపణలతో బదిలీ వేటుకు గురై వైఎస్సార్ జిల్లాకు వెళ్లిన చైతన్యరాయులును మళ్లీ ఉమ్మడి జిల్లాలోని ఆళ్లగడ్డకు నియమించారు. కర్నూలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు, కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఒక సీనియర్ అసిస్టెంటును నియమించిన ఉన్నతాధికారులు సబ్ రిజిస్ట్రార్లను మాత్రం నియమించలేదు. కర్నూలుకు ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు, కల్లూరుకు ఒక సబ్ రిజిస్ట్రార్‌ను నియమించాల్సి ఉంది. గతంలో కర్నూలులో పనిచేసిన ప్రవీణ్ అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో సస్పెన్షన్‌కు గురయ్యారు.

ప్రతిరోజూ 150 రిజిస్ట్రేషన్లు

కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన నాసిర్ పలు ఆరోపణలు ఎదుర్కొన్నారు. అంతకుముందుకు పనిచేసిన సబ్ రిజిస్ట్రార్లు అక్రమ రిజిస్ట్రేషన్లు, అవినీతి ఆరోపణలతో వివాదాల్లో చిక్కుకున్నారు. రెండు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు వివాదాలకు కేంద్రంగా మారిన నేపథ్యంలో ఇటీవల జరిగిన బదిలీల కౌన్సెలింగ్‌లో ఏ ఒక్క సబ్ రిజిస్ట్రార్ కూడా ఈ కార్యాలయాలను అడగలేదు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కర్నూలు, కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి రూ. 127.42 కోట్ల ఆదాయం వచ్చింది. రోజూ 150 రిజిస్ట్రేషన్లతో రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు భారీ ఆదాయం అందించే ఈ రెండు కార్యాలయాలకు సబ్ రిజిస్ట్రార్లను నియమించలేని పరిస్థితి నెలకొంది. ఈ విషయమై ఉన్నతాధికారుల సైతం మాట్లాడలేకపోతున్నారు. పరిస్థితి గమనిస్తే సీనియర్ అసిస్టెంట్లనే ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్లుగా కొనసాగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరి.. ఈ రెండు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల స్థానాలు ఎప్పటికి భర్తీ అవుతాయో చూడాల్సి ఉంది.

కొట్టుకుపోయిన కల్వర్టు

కర్నూలు గ్రామీణ, న్యూస్‌టుడే: కర్నూలు మండల పరిధిలోని గొందిపర్ల, ఇ.తాండ్రపాడు, దేవమాడ తదితర ప్రాంతాల్లో సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. దీనికితోడు పెనుగాలులు వీచాయి. పలు గ్రామాల్లో రైతుల గడ్డివాములు, కర్మాగారాల షెడ్లు కూలిపోయాయి. ఉల్చాల వద్ద తుమ్మల వాగు పొంగడంతో రోడ్డుపై కల్వర్టు కొట్టుకుపోయింది.

నూనె గింజల పంటలపై అవగాహన


ఆముదం పంటను పరిశీలిస్తున్న అధికారులు

ఓర్వకల్లు న్యూస్‌టుడే: నూనె గింజల పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని హైదరాబాద్‌కు చెందిన నూనె గింజల పరిశోధన స్థానం అధికారి గణేశ్ సూచించారు. మండలంలోని ఉయ్యాలవాడలో పోషకాహార భద్రతా పథకం కింద ఆముదం పంటపై మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సాంకేతిక సహాయకుడు శ్రీనివాస్, ఏవో సుధాకర్ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: నూతన మద్యం పాలసీ నేపథ్యంలో ఉద్యోగ భద్రత కల్పించి తమను ఆదుకోవాలని జిల్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాల సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లు కోరారు. పందిపాడులోని ఐఎల్ఎల్ డిపోలో మేనేజరు సుధీర్‌బాబుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఏపీస్టేట్ బేవరేజస్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జతిన్‌చంద్రారెడ్డి, సలహాదారులు నాగచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రణాళికతో లక్ష్యసాధన

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: ఉత్తమ ప్రణాళికతో లక్ష్యం సాధించవచ్చని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి సబిహా పర్వీన్ పేర్కొన్నారు. నగరంలోని పాతబస్తీలోని ఉస్మానియా కళాశాలలో రీజనల్ సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్ డిప్యూటీ డైరెక్టర్ సయ్యద్ సమీవుద్దీన్ ముజమిల్ ఆధ్వర్యంలో మంగళవారం టెట్ పరీక్ష మెటీరియల్‌ను ఆవిష్కరించారు.

బాధ్యులను కఠినంగా శిక్షించాలి

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: తితిదేలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టి బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఉమ్మడి కర్నూలు జిల్లా జనసేన సమన్వయకర్త చింతా సురేష్‌బాబు కోరారు. తితిదే లడ్డూ ప్రసాదం కల్తీ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా కర్నూలులో జనసేన నాయకులు కృష్ణానగర్‌లోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం పూజలు నిర్వహించారు.

హైడ్రా చట్టం తీసుకురావాలి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో జరిగిన భూ కబ్జాలపై వస్తున్న విమర్శలపై రాష్ట్రప్రభుత్వం హైడ్రా వంటి చట్టాన్ని తీసుకురావాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, నాగరాజు, యూసఫ్, న్యాయవాది చంద్రశేఖర్‌లు అభిప్రాయడ్డారు. ఆ సంఘం ఆధ్వర్యంలో ప్రతినిధులు కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా చేపట్టారు.

రాష్ట్రాభివృద్ధి తెదేపాతోనే సాధ్యం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: రాష్ట్రాభివృద్ధి తెదేపాతోనే సాధ్యమని తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. నగరంలోని 42వ వార్డు బాబా బృందావన్ నగర్‌లో మంగళవారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజలకు వివరించారు. నగర తెదేపా అధ్యక్షుడు నాగరాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే: ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా వైద్యాధికారి డా. భాస్కర్ తెలిపారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో మంగళవారం ఆశా కార్యకర్తల నుంచి వినతులను ఆయన స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీఐవో డా. నాగప్రసాద్‌బాబు, ఏవో అరుణ, డీపీహెచ్ఎన్‌వో ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

కాలనీ కబుర్లు

కర్నూలు గాయత్రీ ఎస్టేట్, న్యూస్‌టుడే: స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ ఆడిట్ కర్నూలు జిల్లా రిజిస్ట్రార్ చెన్నకేశవరెడ్డి మంగళవారం కలెక్టర్ రంజిత్‌బాషాను కలిశారు.

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: లక్ష్మీపురంలో మంగళవారం చేపట్టిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఖరీఫ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు.

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: డా. కేవీ సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలను తమ భాగస్వామిగా చేసుకుంటూ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా గరుడ ఏరోస్పేస్ ఒప్పందం చేసుకున్నట్లు కళాశాల ఛైర్మన్ డా. కేవీ సుబ్బారెడ్డి మంగళవారం తెలిపారు.

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆర్‌యూ సెమినార్ హాలులో మంగళవారం నిర్వహించిన వికసిత్ భారత్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

కర్నూలు సంక్షేమం, న్యూస్‌టుడే: మండలంలోని ఉల్చాల, రేమట మీదుగా కొత్తకోటకు వెళ్లే మార్గంలో వంతెన, రహదారుల నిర్మాణాలు చేపట్టాలని సీపీఎం నాయకులు కేవీ నారాయణ డిమాండ్ చేశారు. ఆర్‌అండ్‌బీ ఎస్ఈ నాగరాజుకు వినతి పత్రం అందించారు.

కర్నూలు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక సీపీఐ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆ పార్టీ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, రైతు సంఘం నాయకుడు జగన్నాథం, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లా గనులు, భూగర్భ శాఖ డీడీ రాజశేఖర్ డీఆర్‌డీవో ప్రతినిధులు సి.బెళగల్ మండలంలోని సింగవరం, కొత్తకోట ఇసుక స్టాక్ యార్డులను పరిశీలించారు.

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: పొలం పిలుస్తోందిలో భాగంగా ఏవో విశ్వనాథ్, డాట్ సెంటర్ శాస్త్రవేత్త రవికిషోర్ మంగళవారం రేమట, బసాపురం గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించారు.

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఉచిత ఆర్చరీ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎడిఫై పాఠశాల ప్రిన్సిపల్ జోసఫ్ డెవిడ్ మంగళవారం సూచించారు.

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో కొంతమంది ఉపాధ్యాయులు హాజరు వేయలేదనే కారణంతో 134 మందికి ఇచ్చిన షోకాజు నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆప్టా జిల్లా ప్రధాన కార్యదర్శి సేవాలాల్ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. డీడీవోలు ఇన్‌టైమ్‌లో సెలవులు ఇవ్వాలన్నారు.

మెరుగైన పారిశుద్ధ్యానికి కృషి


ఆర్ఎస్ రోడ్డు కూడలిలో పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: ప్రజల సహకారంతోనే మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ సాధ్యమని నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు పేర్కొన్నారు. ఆర్ఎస్ రోడ్డు, బంగారుపేట, మౌర్యఇన్ కూడలి, రివర్‌వ్యూ కాలనీ, ఆనంద్ థియేటర్ సమీపంలో మంగళవారం ఆయన పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. మురుగు కాల్వలపై ఉన్న నిర్మాణాలను తొలగించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.

పొగాకుతో ఆరోగ్యానికి ముప్పు

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే: యువత పొగాకు బారిన పడకుండా వైద్యఆరోగ్యశాఖ, స్వచ్ఛంద సంస్థలు విస్తృత ప్రచారం నిర్వహించి అవగాహన కల్పించాలని వైద్యకళాశాల ప్రధానాచార్యురాలు డా. చిట్టినర్సమ్మ సూచించారు. వైద్య కళాశాలలోని స్టేట్ క్యాన్సర్ సెంటర్‌లో కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి వర్చువల్‌గా టొబాకో సెజెషన్స్ సెంటర్స్‌ను స్టేట్ క్యాన్సర్ సెంటర్ డైరెక్టర్ డా. ప్రకాశ్, మానసిక వైద్య విభాగాధిపతి డా. నాగేశ్వరావులతో కలిసి ఆమె మంగళవారం ప్రారంభించారు.

కర్నూలు ఎక్సైజ్ డీసీగా పి.శ్రీదేవి

ఈనాడు, కర్నూలు: కర్నూలు ఎక్సైజ్ డీసీగా గతంలో సెబ్ విభాగంలో విధులు నిర్వర్తించిన పి.శ్రీదేవిని నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం రాత్రి జీవో జారీ చేసింది. ప్రస్తుతం కర్నూలు డీసీగా ఉన్న బి.శ్రీలతను ఏలూరు డీసీగా నియమించింది. గతంలో సెబ్ ప్రధాన కార్యాలయంలో పనిచేసిన ఆర్.హనుమంతురావును కర్నూలు ఏసీగా నియమించింది.

జీవనం భారం.. పింఛనే ఆధారం

మంజూరు చేయాలని బాధితుల వేడుకోలు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : వారందరూ ఎలాంటి ఆసరా లేనివారు. కొందరు అనారోగ్యంతో బాధపడుతుండగా.. మరికొందరు ఎలాంటి ఆధారం లేకుండా జీవనం సాగిస్తున్నారు. దీనికితోడు ఆరోగ్య సమస్యలు వేధిస్తుండటంతో సమస్యలు ఎదురవుతున్నాయి. తమకు పింఛన్లు మంజూరు చేస్తే భరోసా కలుగుతుందని బాధితులు పేర్కొంటున్నారు. కలెక్టరేట్‌తోపాటు మండల కార్యాలయాల చుట్టూ తిరిగి వినతిపత్రాలు అందించినా ప్రయోజనం లేకపోతోందని వారు వాపోతున్నారు. ఇకనైనా స్పందించి పింఛన్లు మంజూరు చేయాలని విన్నవిస్తున్నారు.

ఆదాయం అంతంతమాత్రమే : అడివమ్మ




నా భర్త పన్నెండేళ్ల కిందట తనను, తన కుమారుడిని వదిలేసి వెళ్లిపోయాడు. మట్టి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నా.. ఆటో ప్రమాదంలో నడుము భాగం దెబ్బతింది. చివరికి ఇళ్లలో పాచి పనిచేసుకుంటూ కుమారుడిని చదివిస్తూ జీవనం సాగిస్తున్నా.. మేము స్థానిక బళ్లారి చౌరస్తాలో నివాసం ఉంటున్నాం. సొంత ఇల్లు లేదు. అద్దె ఇంట్లో నివసిస్తున్నాం. వచ్చే ఆదాయం సరిపోవడం లేదు. ప్రభుత్వం స్పందించి పింఛను మంజూరు చేయాలి.

రోడ్డున పడేశారు : అనంతమ్మ, కర్నూలు



మేము గీతాముఖర్జీ నగర్‌లో సెంటున్నర స్థలంలో పూరిల్లు నిర్మించుకున్నాం. దీనిని బాలస్వామి అనే వ్యక్తి కుమార్తె పద్మ కబ్జా చేశారు. స్థలంతో సహా ఆక్రమించుకుని మమ్మల్ని రోడ్డున పడేశారు. చివరికి నిరాశ్రయురాలిగా ఆర్టీసీ బస్టాండు తదితర ప్రాంతాల్లో తలదాచుకోవాల్సి వస్తోంది. భర్త, పిల్లలు వదిలేసి వెళ్లిపోయారు. జీవనం కష్టంగా మారింది. కనీసం పింఛను ఇచ్చి ఆదుకోవాలి.

రెండేళ్లుగా ప్రదక్షిణలు : రమణమ్మ



మాది ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడ. నాకు ఆరోగ్యం సరిగా లేదు. ఎడమ కాలికి రక్త ప్రసరణ సరిగా జరగక రెండేళ్ల కిందట తొలగించారు.. సదరమ్‌లో 70 శాతానికి పైబడి వికలత్వం ఉన్నట్లు ధ్రువపత్రం మంజూరు చేశారు. గత ప్రభుత్వ హయాంలో రెండేళ్లుగా పింఛను కోసం తిరిగినా ఎవరూ పట్టించుకోలేదు. పింఛనుకు అన్నీ అర్హతలున్నాయి. ఇకనైనా స్పందించి న్యాయం చేయాలి.

రియల్ మోసంపై ఫిర్యాదు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కర్నూలులోని వేర్వేరు కాలనీలకు చెందిన చిన్నకర్రెన్న, కుమారుడు పెద్ద మద్దిలేటి, సురేశ్ మరికొందరిపై కర్నూలు మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. స్థానిక సోమిశెట్టినగర్‌లోని 26-ఏ నెంబరు స్థలాన్ని నిందితులు మోసగించి షేక్‌ఇమామ్‌బీ అనే మహిళకు విక్రయించి 2023 మార్చి 16న కల్లూరు సబ్ రిస్ట్రార్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్ చేయించారు. తర్వాత ఆమె స్థలం వివరాలపై నిర్ధారించుకునేందుకు సదరు వెంచర్ యజమాని అయిన తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లుని కలిసి వాకబు చేసుకోగా.. నిందితులు మోసగించారని బయటపడింది. దీంతో సోమిశెట్టి వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మందుబాబులపై కేసు నమోదు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ 12 మంది మందుబాబులపై కర్నూలు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ మన్సూరుద్దీన్ ఆధ్వర్యంలో సిబ్బంది రాత్రి నగరశివారులోని సుంకేశుల రోడ్డులో మంగళవారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. 11 మంది ద్విచక్రవాహనదారులు, ఒక ఆటోడ్రైవర్ మద్యం సేవించినట్లు గుర్తించి వాహనాలను జప్తు చేశారు.

నేర సమాచారం

నలుగురిపై కేసు నమోదు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కర్నూలు నగరంలో వేర్వేరు కాలనీలకు చెందిన సమీర్, తండ్రి అహ్మద్, మెకానిక్‌బాషా, మధులపై కర్నూలు మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. రాజేశ్వరీనగర్‌కు చెందిన ఓ వివాహితను నిందితులు ఈ నెల 16న దూషించి దాడి చేసి చంపుతామని బెదిరించారు. గాయపడిన బాధితురాలు ఆసుపత్రిలో చికిత్స పొందారు. అనంతరం కర్నూలు మూడో పట్టణ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు.